# విశాల భారతి

తెలుగు దినపత్రిక

10-05-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 126




## రైతుల పొట్ట కొట్టొద్దు

- తుమ్మిడిహెట్టిపై మంత్రుల మధ్య సమన్వయం, అవగాహన లేవు
- మహారాష్ట్రతో మాట్లాడకుండా కిషన్‌రెడ్డికి లేఖ రాయడం విడ్డూరం
- బడ్జెట్‌లో స్వల్ప నిధులతో ప్రాజెక్టు పూర్తి సాధ్యం కాదు
- రాజకీయ కక్షతోనే రిపేర్లు ఆపి రైతులను ఆగం చేస్తున్నారు
- రేవంత్‌కు రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యం
- రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించి, నేరాలు పెరిగిపోయాయి

02

## త్వరలో సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్

- రద్దీ నివారణకు మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటు
- రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా వర్గీకరణ
- 'తెలంగాణ రైజింగ్-2047' మాస్టర్ ప్లాన్ అమలు
- నది పునరుజ్జీవనం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులు
- కాలుష్య నివారణకు ఈవీ బస్సులు, ఆటోల మార్పు

03

### సిగ్నల్ ఫ్రీ నగరం కోసం త్రీ-లెవల్ రహదారుల ప్లాన్






## బేటీ బచావో నినాదం ఎటు పోయింది?

- బండి సంజయ్‌ను మంత్రి పదవి నుండి ఎప్పుడు తొలగిస్తారు
- రాహుల్ గాంధీ! తెలంగాణలో నడుస్తున్నది 'జంగిల్ రాజ్' కాదా
- 3 నెలలు తిరిగినా ఎఫ్ఐఆర్ కట్టకుండా బాలికపైనే ఎదురుకేసా
- బాలిక గౌరవం విషయంలో బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయా
- బాధితురాలు ఆత్మహత్యాయత్నం చేసినా న్యాయం చేయరా
- ఆడబిడ్డల రక్షణ కోసం ఎన్నిసార్లైనా పోరాడుతాం

02

## పదవి ఉండేనా? ఊడేనా?

బండి సంజయ్ కొడుకుపై పోక్సో కేసు

సామాన్య కార్యకర్త నుండి కేంద్ర మంత్రి స్థాయికి

క్రమశిక్షణ గల నేతగా పార్టీలో మంచి పేరు

సాయి భగీరథ్ వరుస వివాదాలు, తాజా పోక్సో కేసు

కేసు నుండి దృష్టి మళ్లించేందుకే దాడులని ఆరోపణ.

కేసు మాఫీకి బండి కుటుంబం ప్రయత్నం

నేరం రుజువైతే మంత్రి పదవికి ముప్పు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ కాషాయ దళానికి నూతనోత్తేజం పోసి, అగ్రనాయకత్వం వద్ద తిరుగులేని పరపతి సంపాదించుకున్న బండి సంజయ్ కుమార్ ప్రస్తుతం అత్యంత క్లిష్టమైన కాలాన్ని ఎదుర్కొంటున్నారు. రాజకీయ క్షేత్రంలో అజేయుడిగా దూసుకుపోతున్న తరుణంలో, కుమారుడి మితిమీరిన ప్రవర్తన ఆయన వ్యక్తిగత ప్రతిష్ఠను భారీగా దెబ్బతీస్తోంది. సుమతీ శతకంలోని పుత్రోత్సాహము పద్యానికి భిన్నంగా, నేడు తనయుడి కారణంగా సమాజం ముందు సమాధానం చెప్పుకోలేని స్థితిలో చిక్కుకుపోయారు. సంఘ్ సిద్ధాంతాలతో రాటుదేలిన ఓ నాయకుడికి, తన ఇంట్లోనే క్రమశిక్షణారాహిత్యం శాపంగా పరిణమించడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. 1996లో ఏబీవీపీ కార్యకర్తగా ప్రయాణాన్ని ప్రారంభించిన సంజయ్, సుమారు రెండు దశాబ్దాల పాటు ప్రత్యక్ష రాజకీయాల్లో నిలకడగా కొనసాగారు. కరీంనగర్ కార్పొరేటర్‌గా పబ్లిక్ లైఫ్ మొదలుపెట్టి, నేడు దేశ రాజధానిలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా కొలువుదీరడం సామాన్య విషయం కాదు. 2005 ఎన్నికల ద్వారా క్షేత్రస్థాయిలో పట్టు సాధించిన ఆయన, అసెంబ్లీ ఎన్నికల్లో గంగుల కమలాకర్ చేతిలో రెండు పరాజయాలను చవిచూసినా ఏమాత్రం వెనకడుగు వేయలేదు. 2019 అలాగే 2024 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా విజయఢంకా మోగించి, పార్లమెంట్‌లో కరీంనగర్ గొంతుకను బలంగా వినిపిస్తూ వచ్చారు. బీజేపీ హైకమాండ్‌కు అత్యంత నమ్మకస్తుడిగా ముద్రపడటం బండి సంజయ్ ప్రత్యేకత. పార్టీ లైన్ దాటకుండా, క్రమశిక్షణ కలిగిన



మిగతా 2లో..



## సమరోత్సాహంతో తెలంగాణకు మోడీ!

బెంగాల్ గెలుపు స్ఫూర్తితో తెలంగాణ శ్రేణుల్లో ఉత్సాహం



### 3వ సారి ప్రధాని అయ్యాక మోడీ తొలి రాష్ట్ర పర్యటన

రూ. 9,000 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

పరేడ్ గ్రౌండ్స్ సభలో మోడీ కీలక ప్రసంగం

2028లో తెలంగాణలో అధికారమే లక్ష్యంగా వ్యూహం

డబుల్ ఇంజన్ సర్కార్ ఆవశ్యకతపై దిశానిర్దేశం

**తెలంగాణ గడ్డపై కాషాయ జెండాను ఎగురవేయాలన్నది భారతీయ జనతా పార్టీ దశాబ్దాల కల. ఇది కేవలం నిన్న మొన్న పుట్టిన కోరిక కాదు.. చిన్న రాష్ట్రాల సిద్ధాంతానికి మద్దతు ప్రకటించిన నాటి నుంచే కమలనాథులు ఈ వ్యూహానికి పదును పెడుతున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిన వేళ తొలి మద్దతు గొంతుక బీజేపీ నుంచే వినిపించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆ పార్టీకి బలమైన పునాదులు తెలంగాణలోనే ఉన్నాయి. ముఖ్యంగా దక్షిణ తెలంగాణలోని పట్టణ ప్రాంతాల్లో బీజేపీ ఓటు బ్యాంకు సుస్థిరంగా ఉంటూ వస్తోంది. అయితే ఉద్యమ సెంటిమెంటును ఒడిసిపట్టిన బీఆర్ఎస్ రెండుసార్లు అధికారాన్ని చేజిక్కించుకోగా.. ఆ క్రెడిట్‌ను మా ఖాతాలో వేసుకున్న కాంగ్రెస్ 2023లో గద్దెనెక్కింది. ఇప్పుడు తమ వంతు కోసం బీజేపీ సర్వశక్తులు ఒడ్డుతోంది.**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఏ రాష్ట్రాన్నైనా హస్తగతం చేసుకోవాలనుకుంటే బీజేపీ అనుసరించే అండర్ గ్రౌండ్ ప్రిపరేషన్ అత్యంత వ్యూహాత్మకంగా ఉంటుంది. నిశ్శబ్దంగా క్షేత్రస్థాయిలో పని పూర్తి చేసుకుంటూ వెళ్లడం ఆ పార్టీ ప్రత్యేకత. మొదటి ప్రయత్నంలో ప్రత్యర్థి బలాబలాలను తూకం వేసే బీజేపీ.. రెండో అడుగు వేసిందంటే అది ఖచ్చితంగా విజయ తీరాల వైపునకే సాగుతుంది. దీనికి పశ్చిమ బెంగాల్ పరిణామాలే నిలువెత్తు సాక్ష్యం. దశాబ్దాల పాటు ఎర్రకోటగా వర్ధిల్లిన బెంగాల్ రాజకీయ చిత్రాన్ని కమలదళం పూర్తిగా మార్చేసింది. 2016లో కేవలం మూడు సీట్లతో ఉన్న చోట పదేళ్లు తిరగకముందే ఏకంగా 207 స్థానాలను కైవసం చేసుకుని బంపర్ విక్టరీ నమోదు చేయడం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరిచింది. ఇప్పుడు అదే తరహా ప్రయోగాన్ని తెలంగాణలో అమలు చేసేందుకు హైకమాండ్ సిద్ధమైంది. తెలంగాణ రాజకీయ చిత్రపటంలో బీజేపీ గ్రాఫ్ నిలకడగా పెరుగుతోంది. 2014లో టీడీపీతో పొత్తు వల్ల ఆరు సీట్లు సాధించిన ఈ పార్టీ.. 2018లో సొంతంగా ముగ్గురు ఎమ్మెల్యేలను అసెంబ్లీకి పంపింది. 2023 అసెంబ్లీ సమరంలో ఈ సంఖ్య ఎనిమిదికి చేరగా.. ఓటు వాటా ఏకంగా 20 శాతం మార్కును దాటేసింది. ఈ గణాంకాలు పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపాయి. ఇక 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది మంది ఎంపీలను గెలుచుకోవడం ద్వారా తెలంగాణలో సగం

మిగతా 3లో..



## తలొగ్గిన విజయ్..!

- విజయ్‌కు తిరుమావళవన్ అధికారిక మద్దతు
- డిప్యూటీ సీఎం, మంత్రి పదవులకు విజయ్ హామీ
- ఆదవ్ అర్జున వ్యూహం, విజయ్ చొరవతో రాజీ
- 119 మంది ఎమ్మెల్యేల బలంతో విజయ్ సేఫ్
- సీఎం పీఠంపై విజయ్; డీఎంకే కూటమికి షాక్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తమిళనాడు రాజకీయాల్లో గత ఐదు రోజులుగా సాగుతున్న ఉత్కంఠభరిత క్లైమాక్స్ ఎట్టకేలకు శుభం కార్డు పడింది. ద్రవిడ గడ్డపై సరికొత్త రాజకీయ సమీకరణాలకు నాంది పలుకుతూ 'తమిళగ వెట్రి కళగం' అధినేత విజయ్ ముఖ్యమంత్రి పీఠం వైపు వడివడిగా అడుగులు వేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం వరకు ఊగిసలాటలో ఉన్న విడుతలై చిరుతైగల్ కట్చి తన మద్దతు లేఖను అధికారికంగా సమర్పించడంతో చెన్నై కోటలో సంబరాలు అంబరాన్నంటాయి. తోల్ తిరుమావళవన్

మిగతా 2లో..

## బెంగాల్ పీఠంపై బ్రహ్మచారి

- బెంగాల్ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం
- మమతపై విజయం; బీజేపీ తొలిసారి అధికారంలోకి
- మోడీ, అమిత్ షా, చంద్రబాబు సమక్షంలో వేడుక
- దశాబ్దాల తర్వాత బెంగాల్‌లో కాషాయ జెండా
- ఓట్ల తొలగింపుపై మమత ఆరోపణలు
- బెంగాల్ గెలుపు స్ఫూర్తితో తెలంగాణపై బీజేపీ ఫోకస్



విశాలభారతి, స్టేట్ బ్యూరో: దేశ చరిత్రలో సరికొత్త రాజకీయ సంచలనం ఆవిష్కృతమైంది. దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ పశ్చిమ బెంగాల్ పీఠంపై భారతీయ జనతా పార్టీ తన జైత్రయాత్రను విజయవంతంగా ముగించింది. ప్రధాని మోడీ ధీరత్వం, అమిత్ షా వ్యూహచతురత తోడవ్వడంతో బెంగాల్

మిగతా 2లో..

## మోదీకి కవిత బహిరంగ లేఖ

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలి

2027 జనాభా లెక్కల్లో ఓబీసీ కాలమ్ చేర్చాలి

మహిళా రిజర్వేషన్లలో ఓబీసీలకు ఉప కోటా కల్పించాలి

తెలంగాణ బీసీ బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం తెలపాలి

లింగ సమానత్వం, డేటా ఆధారిత న్యాయం జరగాలి

ప్రధాని పర్యటనలో ఈ 4 అంశాలపై స్పష్టత ఇవ్వాలి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ గడ్డపై అడుగుపెడుతున్న తరుణంలో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభకు సర్వం సిద్ధమవుతుండగా తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంధించిన బహిరంగ లేఖ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

మిగతా 3లో..

# బేటీ బచావో నినాదం ఎటు పోయింది?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాజకీయాల్లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసు కార్చిచ్చులా వ్యాపించింది. ఈ సున్నితమైన అంశంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కన్నెర్ర చేస్తూ సామాజిక మాధ్యమాల వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు. మహిళా భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం చెబుతున్న నీతులకు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలకు పొంతన లేదని ఆయన ఘాటుగా విమర్శించారు. ఒక మైనర్ బాలిక ఆత్మగౌరవంపై దాడి జరిగినప్పుడు వ్యవస్థలు ఎందుకు స్తంభించిపోయాయని ఆయన నిలదీశారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు అధికారం చెలాయిస్తున్న నేతలు తమ కుటుంబ సభ్యుల నేరాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'బేటీ బచావో బేటీ పఢావో' కార్యక్రమం కేవలం ప్రచారానికే పరిమితమైందా అని కేటీఆర్ నిశితంగా ప్రశ్నించారు. ఒక కేంద్ర మంత్రి కుమారుడు పోక్సో చట్టం కింద నిందితుడిగా ఉన్నప్పుడు ప్రధాని మౌనం పాటించడం భావ్యం కాదని పేర్కొన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పే బీజేపీ నేతలు ఇప్పుడు తమ సొంత పార్టీ నేత విషయంలో ఎందుకు మినహాయింపు కోరుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని లేనిపక్షంలో ఆయనతో రాజీనామా చేయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మహిళా సాధికారతపై ప్రసంగాలు చేసే వారు ఇప్పుడు బాధితురాలికి ఏ సమాధానం చెబుతారని ఆయన నిలదీశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును కూడా కేటీఆర్ తీవ్రంగా ఎండగట్టారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో తెలంగాణలో 'జంగిల్ రాజ్' సాగుతోందని ఆయన అభివర్ణించారు. ఒక మైనర్ బాలిక అన్ని రకాల ఆధారాలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు పోలీసులు స్పందించడానికి మూడు నెలల సమయం పట్టడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కుమారుడు నిందితుడిగా ఉండటం వల్లనే పోలీసులు విచారణలో జాప్యం చేస్తున్నారా అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. సాధారణ పౌరులకు వర్తించే చట్టాలు అధికార పార్టీ నేతల పిల్లలకు వర్తించవా అని పోలీసు యంత్రాంగాన్ని నిగ్గదీశారు. ఈ జాప్యం వెనుక ఉన్న రాజకీయ ఒత్తిళ్లను ప్రజలు గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు. బాధితురాలైన మైనర్ బాలికపైనే ఎదురు కేసులు పెట్టడం తెలంగాణ పోలీసుల నైతికతను ప్రశ్నార్థకం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. హనీట్రాప్ వసూళ్ల పేరుతో బాధితురాలిని నిందితురాలిగా మార్చడం వెనుక ఏ నిబంధనలు ఉన్నాయని ఆయన ప్రశ్నించారు. బాధితురాలు గత మూడు నెలలుగా న్యాయం కోసం తిరుగుతూ రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేసిందన్న వార్త విని ప్రతి గుండె కలత చెందుతుందని ఆయన పేర్కొన్నారు. ఒక 17 ఏళ్ల అమ్మాయి ఎఫ్ఐఆర్ నమోదు చేయించుకోవడానికే ఇంతటి పోరాటం చేయాల్సి రావడం మనం ఎంతటి భయంకరమైన నరకంలో ఉన్నామో తెలియజేస్తోందన్నారు. బాధితురాలిని వేధించడం మానుకుని నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన హితవు పలికారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గతంలో ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ కేసులో బాధితురాలికి అండగా నిలిచిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. అదే రీతిలో ఇప్పుడు హైదరాబాద్‌కు వచ్చి తెలంగాణ బాధితురాలికి అండగా నిలబడతారా అని ఆయన సవాల్ విసిరారు. ఇక్కడ బాధితురాలికి అండగా నిలబడకపోతే కాంగ్రెస్ పార్టీ నీతులు కేవలం ఇతర రాష్ట్రాలకే పరిమితమా అని ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీకి ఒక ఫ్రాంచైజీలాగా పనిచేస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. ఒక మైనర్ బాలిక గౌరవం విషయంలో కాంగ్రెస్ మరియు బీజేపీ ఒక అపవిత్రమైన అసహ్యకరమైన ఒప్పందానికి వచ్చాయని ఆయన ఘాటుగా ఆరోపించారు. రాజకీయాల కోసం ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. కేసు విచారణలో జరుగుతున్న జాప్యంపై కేటీఆర్ కొన్ని కీలక గణాంకాలను ప్రస్తావించారు. సుమారు 90 రోజుల పాటు ఒక కుటుంబం ఎఫ్ఐఆర్ కోసం పోరాడటం అనేది వ్యవస్థల వైఫల్యానికి పరాకాష్ట అని ఆయన పేర్కొన్నారు. సాధారణంగా పోక్సో కేసుల్లో 24 గంటల్లోపు స్పందించాల్సిన పోలీసులు మూడు నెలల పాటు కాలయాపన చేయడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. బాధితురాలి కుటుంబాన్ని నేరస్తుల్లా చూస్తూ వేధించడం వల్ల వారు మానసిక క్షోభకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడిని కాపాడటానికి పోలీసులు ఇస్తున్న ప్రాధాన్యత బాధితురాలి రక్షణకు ఎందుకు ఇవ్వడం లేదని ఆయన నిలదీశారు. బాధితురాలి కుటుంబానికి జరుగుతున్న అన్యాయంపై పౌర సమాజం స్పందించాలని ఆయన కోరారు. తెలంగాణ గడ్డపై మహిళల గౌరవం కోసం గతంలో అనేక పోరాటాలు జరిగాయని కేటీఆర్ గుర్తు చేశారు. నిజాం నవాబుల కాలం నుంచి నేటి ప్రజాస్వామ్య వ్యవస్థ వరకు అణచివేతదారులపై పోరాడిన చరిత్ర మనదని ఆయన పేర్కొన్నారు. ఆడబిడ్డల రక్షణ కోసం అవసరమైతే మరో మిలియన్ మార్చ్ పోరాటం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు మారినా వ్యవస్థలు మారినా ఆడపిల్లల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. నేరస్తులు ఎంతటి పలుకుబడి ఉన్నవారైనా సరే చట్టం ముందు సమానమేనని నిరూపించాల్సిన బాధ్యత హోం శాఖపై ఉందని ఆయన హితవు పలికారు. ప్రజల నుంచి వస్తున్న ఆగ్రహాన్ని ప్రభుత్వం గమనించాలని ఆయన హెచ్చరించారు. బాధితురాలి కుటుంబం ఎదుర్కొంటున్న వేధింపుల తీరు అత్యంత దారుణంగా ఉందని కేటీఆర్ వివరించారు. నిందితుడి తండ్రి కేంద్ర హోం శాఖలో కీలక పదవిలో ఉండటం వల్ల పోలీసు వ్యవస్థను ప్రభావితం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. బాధితురాలి క్యారెక్టర్‌ను దెబ్బతీసేలా అసత్య ఆరోపణలు ప్రచారం చేయడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆయన విమర్శించారు. పోక్సో చట్టంలోని కఠిన నిబంధనలను నిందితుడి విషయంలో ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ విచారణను నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై కేటీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి శాంతిభద్రతలు క్షీణించాయని ఆయన విమర్శించారు. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న అకృత్యాల విషయంలో ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోందని ఆయన దుయ్యబట్టారు. బీజేపీ నేతలతో ఉన్న రహస్య అవగాహన వల్లనే ఈ కేసులో జాప్యం జరుగుతోందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర హోం మంత్రిగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి ఈ విషయంలో మౌనం వీడాలని ఆయన కోరారు. బాధితురాలికి న్యాయం జరగకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఆడబిడ్డల కన్నీళ్లు ప్రభుత్వానికి శాపంగా మారుతాయని ఆయన పేర్కొన్నారు. నగరంలో జరిగిన ఈ ఉదంతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందని కేటీఆర్ తెలిపారు. ఒక కేంద్ర మంత్రి కుటుంబ సభ్యుడే ఇలాంటి కేసులో చిక్కుకోవడం భారత ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటని ఆయన అభివర్ణించారు. నిందితుడికి రక్షణగా నిలిచే వారు కూడా సమాజానికి సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. బాధితురాలి కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేయడం వల్ల నిజాలను దాచలేరని ఆయన పేర్కొన్నారు. చట్టం ముందు అందరూ సమానమని నిరూపించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన వివరించారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. మహిళా లోకం ఈ అన్యాయాన్ని గమనిస్తోందని ఆయన గుర్తు చేశారు.

# రైతుల పొట్ట కొట్టొద్దు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం విషయంలో కాంగ్రెస్ మంత్రుల పొంతన లేని మాటలు వారి అజ్ఞానానికి నిదర్శనమని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. సిద్దిపేటలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి సర్కార్‌కు రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని మండిపడ్డారు. ముఖ్యమంత్రికి, ఆయన కేబినెట్ సహచరులకు ప్రాజెక్టుల భౌగోళిక స్థితిగతులపై కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కడితే గ్రావిటీ ద్వారా నీళ్లు వెళ్తాయని ఒకరు, లిఫ్ట్ పెడతామని మరొకరు, సుందిళ్లకు నీళ్లు తెస్తామని ఇంకొకరు మాట్లాడటం చూస్తుంటే వీరు రాష్ట్రాన్ని ఆగం చేసేలా ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అసలు మహారాష్ట్రతో ఒప్పందం చేసుకోకుండా కేవలం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాయడం వల్ల ప్రయోజనం ఏముంటుందని హరీశ్ రావు ప్రశ్నించారు. పొరుగు రాష్ట్రంతో స్నేహపూర్వకంగా చర్చించి ఒప్పందాలు చేసుకోవాలి తప్ప, ఇలాంటి రెచ్చగొట్టే ధోరణి వల్ల ప్రాజెక్టులు ముందుకు పడవని హితవు పలికారు. గతంలో కిరణ్ కుమార్ రెడ్డి హయాంలోనే 150 మీటర్ల ఎత్తుకు ఒప్పందం జరిగిందని మంత్రి వివేక్ చెబుతున్న మాటలను హరీశ్ రావు తూర్పారబట్టారు. ఒకవేళ అప్పుడే ఒప్పందం పూర్తయితే, గత కాంగ్రెస్ పాలనలో తుమ్మిడిహెట్టి వద్ద పనులు ప్రారంభించకుండా చేవెళ్ల దగ్గర ఎందుకు మొదలుపెట్టారని నిలదీశారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో కాంగ్రెస్ ఎప్పుడూ ద్వంద్వ ప్రమాణాలే పాటిస్తుందని ఆరోపించారు. బడ్జెట్ కేటాయింపులను చూస్తే ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతుందన్నారు. 2024 నుంచి ఇప్పటివరకు ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు కోసం కేటాయించిన మొత్తం కేవలం 82 కోట్లు మాత్రమేనని, ఈ స్వల్ప నిధులతో వేల కోట్ల వ్యయంతో కూడిన ప్రాజెక్టును నాలుగేళ్లలో ఎలా పూర్తి చేస్తారని గట్టిగా అడిగారు. కాంగ్రెస్ నేతల మాటలు కోటలు దాటుతున్నా, చేతలు మాత్రం గడప దాటడం లేదన్నారు. నిధుల కేటాయింపులు, వ్యయం విషయంలో రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని హరీశ్ రావు దుయ్యబట్టారు. గతంలో కాంగ్రెస్ హయాంలో కేవలం రూ. 3780 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే, నిన్న ముఖ్యమంత్రి 11 వేల కోట్లు పూర్తయ్యాయని చెప్పడం హాస్యాస్పదమన్నారు. అవినీతి అనేది కాంగ్రెస్ డీఎన్ఏలోనే ఉందని, పని చేయకుండానే మొబిలైజేషన్ అడ్వాన్స్ కింద రూ. 2300 కోట్లు గతంలో భోంచేశారని ఆరోపించారు. ఇప్పుడు కూడా ప్రజలను మభ్యపెట్టడానికే తుమ్మిడిహెట్టి వద్ద జలహారతుల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. వాస్తవానికి అక్కడ నీటి లభ్యత కంటే మేడిగడ్డ వద్దే నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుందని సాంకేతిక వివరాలతో వివరించారు. ఈ ఎండకాలంలో మేడిగడ్డ వద్ద 6400 క్యూసెక్కుల నీరు వృథాగా పోతుంటే, తుమ్మిడిహెట్టి వద్ద కేవలం 2000 క్యూసెక్కులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కక్షపూరిత ధోరణిని వీడాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. మేడిగడ్డ పిల్లర్ల మరమ్మతులు చేపడితే కేసీఆర్‌కు పేరు వస్తుందనే కురచ బుద్ధితో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. రాబోయే కాలంలో ఎల్ నినో ప్రభావంతో కరువు ముప్పు పొంచి ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా, ప్రభుత్వం మొద్దునిద్ర పోతోందన్నారు. కాళేశ్వరం అనేది తెలంగాణ రైతాంగానికి కటిక చీకట్లో కారుదీపం లాంటిదని, ఆ ప్రాజెక్టును కించపరచడం అంటే తెలంగాణ జాతికి ద్రోహం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మేడిగడ్డ రిపేర్లు పూర్తి చేసి సాగునీరు అందించాలని, లేకపోతే ప్రకృతి సిద్ధమైన శిక్ష తప్పదని హెచ్చరించారు. రాజకీయాల కోసం రైతుల పొట్ట కొట్టొద్దని సూచించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి దారుణంగా తయారైందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నడిబొడ్డున సీనియర్ ఐపీఎస్ అధికారి భార్య హత్యకు గురైనా నిందితులను పట్టుకోలేకపోవడం పోలీసుల వైఫల్యమేనని పేర్కొన్నారు. ప్రజలను జాగ్రత్తగా ఉండమని చెప్పే సీపీ, తన బాధ్యతను సక్రమంగా నిర్వహించడం లేదని విమర్శించారు. కరీంనగర్‌లో పట్టపగలే దోపిడీలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. నేరస్థులను పట్టుకోవడంలో విఫలమవుతున్న ప్రభుత్వం, బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలపై, నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధించడంలో మాత్రం ముందుంటుందని ఆరోపించారు. క్రిశాంక్ లాంటి నాయకులను అన్యాయంగా జైలులో ఉంచడం రాజకీయ కక్షసాధింపు చర్యేనని మండిపడ్డారు. తెలంగాణలో క్రైమ్ రేటు విపరీతంగా పెరిగిపోయిందని కేంద్ర ప్రభుత్వ నివేదికలే చెబుతున్నాయని హరీశ్ రావు గుర్తు చేశారు. అభివృద్ధిని గాలికి వదిలేసి, ప్రతిపక్షాలను వేధించడమే కాంగ్రెస్ ఏకైక ఎజెండాగా మారిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర పరువు తీస్తున్న మంత్రులు ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అబద్ధపు ప్రచారాలతో ఎంతో కాలం నెట్టుకురాలేరని, పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రాజెక్టుల విషయంలో చిత్తశుద్ధి ఉంటే తక్షణమే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ఎకో సెన్సిటివ్ జోన్, వైల్డ్ లైఫ్ క్లియరెన్స్ వంటి కీలక అడ్డంకులు ఉన్నాయని, వాటిని పరిష్కరించకుండా కేవలం ఫోజులు కొడితే ప్రయోజనం ఉండదని హరీశ్ రావు అన్నారు. సుప్రీంకోర్టు తీర్పులు, పర్యావరణ అనుమతులపై కనీస జ్ఞానం లేకుండా మంత్రులు మాట్లాడుతున్న తీరు విచారకరమన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రాజెక్టులు అంటే కేవలం కాంట్రాక్టర్లకు మేలు చేసే సాధనాలుగానే ఉండేవని, ఇప్పుడు కూడా అదే ధోరణి కనిపిస్తోందని విమర్శించారు. రాష్ట్ర రైతాంగ ప్రయోజనాల దృష్ట్యా రాజకీయాలు పక్కన పెట్టి మేడిగడ్డను పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకుంటే తెలంగాణ వ్యవసాయ రంగం కుదేలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాష్ట్రంలో అరాచక శక్తులు రెచ్చిపోతున్నాయని హరీశ్ రావు ఆరోపించారు. ఎమ్మెల్యేల క్యాంప్ ఆఫీసుల మీద దాడులు జరుగుతున్నా ఆపే నాథుడే లేడని, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే వారిని మాత్రం ఉక్కుపాదంతో అణచివేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. నీటి ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ఊరూరా ఎండగడతామని చెప్పారు. తెలంగాణ గడ్డపై కేసీఆర్ నిర్మించిన అద్భుత కట్టడాలను కించపరిస్తే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదని హరీశ్ రావు తన ప్రసంగాన్ని ముగించారు.

# తలొగ్గిన విజయ్..!

**మొదటిపేజీ తరువాయి**



తన పట్టును నిరూపించుకుంటూనే విజయ్‌కు జై కొట్టడం కోలీవుడ్ నుంచి పొలిటిక్స్‌లోకి వచ్చిన దళపతికి పెద్ద బూస్ట్ ఇచ్చింది. ఈ కీలక మలుపుతో తమిళ రాజకీయాల్లో దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న పాత శకం ముగిసిపోయినట్లయింది. ఈ డీల్ వెనుక ఉన్న అసలు సీక్రెట్ తిరుమావళవన్ ప్రతిపాదించిన డిమాండ్లపై విజయ్ ఇచ్చిన అభయం. తన ఇద్దరు ఎమ్మెల్యేల బలంతో ప్రభుత్వ మనుగడను శాసించే స్థాయికి చేరిన వీసీకే నేత సామాజిక అజెండాను అస్త్రంగా మలిచారు. పవర్ పాలిటిక్స్‌లో కేవలం మద్దతు ఇవ్వడమే కాకుండా అధికారంలో వాటా కోరుతూ ఆయన వేసిన ఎత్తుగడ ఫలించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా దళిత రాజకీయ పార్టీ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా మారబోతుండటం రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయి. పాత మిత్రులైన డీఎంకేతో బంధం తెంచుకోవడం రిస్క్ అని తెలిసినా కొత్త తరం నాయకత్వం వైపు వీసీకే మొగ్గు చూపడం విశేషం. ప్రధానంగా మూడు డిమాండ్ల చుట్టూ ఈ చర్చల పర్వం సాగింది. ప్రభుత్వంలో 'పవర్ షేరింగ్' ఉండాలనేది వీసీకే మొదటి కండిషన్. ఇందులో భాగంగా ఒక కీలక కేబినెట్ బెర్త్ సహా ఉప ముఖ్యమంత్రి పదవి గురించి సుదీర్ఘంగా మంతనాలు జరిగాయి. ఈ ప్రతిపాదనపై విజయ్ సానుకూలంగా స్పందించడంతో ప్రతిష్టంభన తొలిగింది. రాష్ట్రంలో కుల వివక్షను రూపుమాపే కమిషన్లను మరింత బలోపేతం చేయడం అలాగే ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రమోషన్ల విషయంలో రిజర్వేషన్లు పక్కాగా అమలు చేసేలా చట్టపరమైన హామీని తిరుమావళవన్ సాధించుకున్నారు. ఇది పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. దళిత సాధికారత కోసం ప్రత్యేక నిధుల కేటాయింపు మరొక కీలక అంశం. సామాజికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి బడ్జెట్‌లో సింహభాగం కేటాయించాలని వీసీకే పట్టుబట్టింది. అణగారిన వర్గాల ఓటు బ్యాంకును ఆకర్షించడమే కాకుండా వారి జీవితాల్లో వెలుగులు నింపేలా ఒక ప్రత్యేక ప్యాకేజీపై విజయ్ సంతకం చేసినట్లు సమాచారం. ఈ సామాజిక ఇంజనీరింగ్ ద్వారా అటు దళపతి ఇటు తిరుమావళవన్ ఒకరికొకరు తోడయ్యారు. శనివారం ఉదయం జరిగిన పార్టీ హైలెవల్ కమిటీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనా విజయ్ స్వయంగా ఫోన్ చేసి తిరుమాతో మాట్లాడటం సీన్‌ను టోటల్ మార్చేసింది. ఈ భారీ ఆపరేషన్‌లో టీవీకే వ్యూహకర్త ఆదవ్ అర్జున ట్రబుల్ షూటర్ పాత్ర పోషించారు. వీసీకేతో ఉన్న పాత అనుబంధాలను వాడుకుని చర్చలను సఫలం చేయడంలో ఆయనదే మెయిన్ రోల్. డీఎంకే కూటమి నుంచి బయటకు రావడం వల్ల కలిగే పొలిటికల్ మైలేజీని వివరిస్తూనే కొత్త ప్రభుత్వంలో దక్కే ప్రయారిటీ గురించి వీసీకే నేతలకు క్లారిటీ ఇచ్చారు. ఆదవ్ అర్జున చాకచక్యంగా వ్యవహరించి తిరుమావళవన్‌ను ఒప్పించడంతో విజయ్ వర్గం ఊపిరి పీల్చుకుంది. లేఖను అందుకోవడానికి ఆయనే స్వయంగా వెళ్లి కూటమి బలాన్ని చాటారు. ప్రస్తుతం అసెంబ్లీలో మేజిక్ ఫిగర్‌ను దాటి 119 మంది ఎమ్మెల్యేల బలంతో విజయ్ పక్షం ఫుల్ సేఫ్ జోన్‌లో ఉంది. ఏ పార్టీకైనా అధికారం దక్కాలంటే ఉండాల్సిన కనీస సంఖ్యను దాటేయడంతో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను కలిసేందుకు రంగం సిద్ధమైంది. సాయంత్రం లోపే మద్దతు లేఖల సెట్‌ను రాజ్‌భవన్‌లో సమర్పించనున్నారు. దీంతో సర్కార్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. తమిళనాడు గడ్డపై ఒక స్టార్ హీరో ముఖ్యమంత్రి కాబోతుండటం ఎంజీఆర్, జయలలిత కాలం నాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తోంది. రాజకీయాల్లో ఎవరూ శాశ్వత మిత్రులు కాదు శత్రువులు కారు అనే మాటను వీసీకే మరోసారి నిరూపించింది. ఆదివారం సాయంత్రం లోపే ప్రమాణ స్వీకార కార్యక్రమం పూర్తి కావాలని ముహూర్తం ఫిక్స్ చేసినట్లు టాక్. ఇప్పటికే చెన్నైలోని పార్టీ కార్యాలయం వద్ద వేల సంఖ్యలో అభిమానులు పోటెత్తారు. విజయ్ టీమ్ ఒక పక్క ప్రభుత్వం ఏర్పాటు పనుల్లో బిజీగా ఉంటే మరోపక్క కేబినెట్ కూర్పుపై కసరత్తు మొదలుపెట్టింది. సామాజిక సమతుల్యత దెబ్బతినకుండా అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా కసరత్తు సాగుతోంది. డైనమిక్ లీడర్‌గా ఇమేజ్ ఉన్న విజయ్ పాలనలో ఎలాంటి మార్పులు తెస్తారనేది ఇప్పుడు హాట్ టాపిక్. కేవలం సినిమాల్లోనే కాకుండా నిజ జీవితంలో కూడా విలన్ల వంటి రాజకీయ సమస్యలను ఆయన ఎలా ఎదుర్కొంటారో చూడాలని సామాన్యులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా యువత ఈ మార్పును మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తోంది. గతంలో ద్రవిడ పార్టీల మధ్యే సాగిన అధికారం ఇప్పుడు కొత్త పార్టీ చేతుల్లోకి వెళ్లడం విప్లవాత్మక పరిణామం. టీవీకే మేనిఫెస్టోలోని అంశాలను అమలు చేయడం విజయ్ ముందున్న అసలైన సవాలు. విజయ్ టీమ్ పక్కా ప్లానింగ్‌తో ప్రతి అడుగు వేస్తోంది. కేవలం మద్దతు సంపాదించడమే కాకుండా స్థిరమైన ప్రభుత్వాన్ని అందించేలా అగ్రిమెంట్లు చేసుకున్నారు. తోల్ తిరుమావళవన్ డిమాండ్లను అంగీకరించడం ద్వారా సామాజిక న్యాయంపై తనకున్న చిత్తశుద్ధిని విజయ్ చాటుకున్నారు. ఇది కేవలం గద్దెనెక్కడం మాత్రమే కాదు రాబోయే ఐదేళ్ల కాలానికి ఒక పక్కా రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకోవడం కూడా. రాష్ట్రంలోని ఇతర చిన్న పార్టీలు కూడా ఇప్పుడు విజయ్ వైపు మొగ్గు చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# పదవి ఉండేనా? ఊడేనా?

**మొదటిపేజీ తరువాయి**



సైనికుడిగా ఆయన ఎదిగిన తీరు ఆదర్శనీయం. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బీజేపీ కేడర్‌లో కొత్త జోష్ నింపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై ప్రజా సంగ్రామ యాత్రల ద్వారా సమరశంఖం పూరించి, పార్టీని బలోపేతం చేయడంలో సక్సెస్ అయ్యారు. ఇన్ని విజయాలు సాధించినా, కుమారుడు బండి సాయి భగీరథ్ చుట్టూ అల్లుకున్న వివాదాలు సంజయ్ కీర్తి కిరీటాన్ని మసకబారుస్తున్నాయి. మహీంద్ర యూనివర్సిటీలో జూనియర్లపై దాడులు, ఢిల్లీలోని విద్యా సంస్థలో గొడవలు వంటి ఘటనలు సాయి భగీరథ్ వ్యక్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేశాయి. గతంలోనే ర్యాగింగ్ ఆరోపణలు ఎదుర్కొన్న భగీరథ్, ప్రస్తుతం ఓ ప్రేమ వ్యవహారం నేపథ్యంలో పోక్సో చట్టం కింద చిక్కుకోవడం పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసులో విచారణ ముమ్మరమై, ఆరోపణలు వాస్తవమని తేలితే కేంద్రమంత్రి పదవి ఊడే అవకాశం ఉందని ఢిల్లీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒకవైపు పార్టీలో నైతిక విలువలు బోధించే సంజయ్‌కు, తనయుడి అకృత్యాలు మింగుడుపడని పరిస్థితిగా మారాయి. కుమారుడి తప్పిదాలు వెలుగులోకి రాకుండా ఉండేందుకు బాధితురాలి తల్లిదండ్రులను ప్రలోభపెట్టడం లేదా బెదిరించడం వంటి వ్యూహాలు ఫలించలేదని రాజకీయ సమాచారం. ఈ క్రమంలోనే అసలు విషయం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు 'అటాక్ పాలిటిక్స్' తెరపైకి తెచ్చినట్లు విమర్శలు వస్తున్నాయి. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన కామెంట్స్‌ను సాకుగా తీసుకుని, గంగుల కమలాకర్ క్యాంపు ఆఫీసుపై దాడులు చేయించడం కేవలం డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమేనని కరీంనగర్ విశ్లేషకులు భావిస్తున్నారు. తీవ్రమైన క్రిమినల్ కేసు నుంచి బయటపడటానికి రాజకీయ గొడవలను ఆయుధంగా వాడుకోవడం చర్చనీయాంశమైంది. ఒక సాధారణ కార్యకర్త స్థాయి నుండి అత్యున్నత కేంద్రమంత్రి పదవిని అలంకరించిన సంజయ్, కుమారుడి చేష్టల వల్ల రాజకీయ అగ్నిపరీక్షను ఎదుర్కొంటున్నారు. రాజకీయాల్లో ప్రత్యర్థులను సమర్థవంతంగా ఎదుర్కొనే సత్తా ఉన్నప్పటికీ, పుత్రవాత్సల్యం ఆయనను బలహీనపరుస్తోంది. ఒకవేళ విచారణలో నిగ్గు తేలే నిజాలు ప్రతికూలంగా ఉంటే, బీజేపీ అగ్రనాయకత్వం కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. గతం నుంచి ఎందరో దిగ్గజ నాయకులు తమ సంతానం చేసిన పొరపాట్ల వల్ల రాజకీయంగా వెనుకబడ్డారు, ఇప్పుడు సంజయ్ కూడా అదే బాటలో ఉన్నారా అనే అనుమానాలు బలపడుతున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న పోక్సో కేసు విచారణ బండి సంజయ్ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించనుంది. చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెబుతున్నప్పటికీ, లోలోపల సెటిల్మెంట్ ప్రయత్నాలు సాగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. నిష్కళంకమైన రాజకీయ జీవితం గడపాలని కోరుకునే నేతలకు, కుటుంబ సభ్యుల ప్రవర్తన ఎంతటి ముప్పుగా మారుతుందో ఈ ఘటన నిరూపిస్తోంది. కరీంనగర్ గడ్డపై ఎదురులేని నేతగా ఎదిగిన సంజయ్, తనయుడి కారణంగా పదవికి గండం తెచ్చుకోవడం శోచనీయం. కేడర్ సైతం ఈ పరిణామాలను గమనిస్తూ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు భోగట్టా. కేంద్ర హోం శాఖ పరిధిలో శాంతిభద్రతల అంశం ముడిపడి ఉంటుంది, అటువంటి హోదాలో ఉన్న వ్యక్తి కుమారుడే చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడటం తీవ్రమైన చర్చకు దారితీస్తోంది. నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ ఒత్తిడిని తట్టుకుని సంజయ్ ఎంతకాలం పదవిలో కొనసాగుతారో చూడాలి. డైవర్షన్ పాలిటిక్స్ ద్వారా కేసు తీవ్రతను తగ్గించవచ్చనే ప్లాన్ బెడిసికొట్టేలా కనిపిస్తోంది. నిజాయితీ గల నేతగా పేరు తెచ్చుకున్న బండి, ఇప్పుడు ఈ బురద నుంచి ఎలా బయటపడతారనేది ఆసక్తికరం. తెలంగాణ బీజేపీలో బండి సంజయ్ శైలి ప్రత్యేకం. అగ్రెసివ్ పాలిటిక్స్‌తో ప్రత్యర్థులను వణికించే ఆయన, ఇప్పుడు తన ఇంట్లోనే తలపెట్టిన చిచ్చుతో సతమతమవుతున్నారు. తండ్రి కష్టపడి సంపాదించిన పేరును నిలబెట్టాల్సింది పోయి, కొడుకు తన చేష్టలతో అల్లరిపాలు చేయడం విషాదకరం. పోక్సో చట్టం నిబంధనలు చాలా కఠినంగా ఉంటాయి, కాబట్టి ఈ కేసు నుంచి తప్పించుకోవడం అంత సులభం కాదు. రాజకీయ విశ్లేషకుల అంచనా ప్రకారం, రాబోయే రోజుల్లో సంజయ్ మరిన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి రావచ్చు. సమాజంలో గౌరవప్రదమైన హోదాలో ఉన్నప్పుడు బాధ్యత కూడా అంతే స్థాయిలో ఉండాలి. కానీ, సాయి భగీరథ్ వ్యవహారశైలి వల్ల ఆ బాధ్యత విస్మరించబడినట్లు స్పష్టమవుతోంది. కరీంనగర్ రాజకీయాల్లో తనకంటూ ఒక ముద్ర వేసుకున్న బండికి, ఇప్పుడు సొంత జిల్లాలోనే ప్రతిఘటనలు మొదలయ్యాయి. అటాక్ పాలిటిక్స్ ద్వారా ప్రజల సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నా, లోతుగా గమనిస్తే కుమారుడి కేసును కప్పిపుచ్చే యత్నంగానే కనిపిస్తోంది.

# బెంగాల్ పీఠంపై బ్రహ్మచారి

**మొదటిపేజీ తరువాయి**

రాజకీయ యవనికపై 'బ్రహ్మచారి' పాలన అడుగుపెట్టింది. నాడు మోదీ, నేడు యోగీ తరహాలోనే సువేందు అధికారి తన అవివాహిత నిబద్ధతతో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కంకణం కట్టుకున్నారు. భవానీపూర్‌లో మమతా బెనర్జీపై సాధించిన చారిత్రాత్మక విజయం సువేందును బీజేపీ అగ్రనేతల దృష్టిలో తిరుగులేని నాయకుడిగా నిలబెట్టింది. నేడు బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే అట్టహాస వేడుకలో ఆయన ముఖ్యమంత్రిగా పట్టాభిషిక్తులు అయ్యారు. నలభై ఐదు ఏళ్ల సుదీర్ఘ రాజకీయ వనవాసం తర్వాత పశ్చిమ బెంగాల్ గడ్డపై కమల వికాసం జరిగింది. 2011 నుండి బెంగాల్‌ను ఏకచత్రాధిపత్యంగా ఏలుతున్న తృణమూల్ కాంగ్రెస్ కోటను బద్దలు కొట్టడం సామాన్యమైన విషయం కాదు. సుమారు 15 ఏళ్ల పాటు బీజేపీ చేసిన నిరంతర పోరాటం ఇప్పుడు ఫలించింది. గతంలో కేవలం 3 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైన బీజేపీ, ఈసారి మ్యాజిక్ ఫిగర్ దాటి రికార్డు స్థాయి సీట్లు సాధించడం ఒక పొలిటికల్ మిరాకిల్. ఈ విజయం వెనుక సువేందు అధికారి పడ్డ శ్రమ, క్షేత్రస్థాయిలో ఆయన నిర్మించిన క్యాడర్ బలం స్పష్టంగా కనిపిస్తోంది.



కోల్‌కతా వేదికగా జరగనున్న ఈ ప్రమాణస్వీకారోత్సవం దేశ రాజకీయాల్లో ఒక పెను మార్పుకు సంకేతం. శుక్రవారం జరిగిన శాసనసభాపక్ష సమావేశంలో సువేందు అధికారిని ఏకగ్రీవంగా నాయకుడిగా ఎన్నుకోవడం బీజేపీ క్రమశిక్షణకు నిదర్శనం. అమిత్ షా పర్యవేక్షణలో జరిగిన ఈ ఎంపిక ప్రక్రియ రాష్ట్ర నేతల్లో నూతనోత్సాహాన్ని నింపింది. ఈ మెగా ఈవెంట్‌కు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న బీజేపీ ముఖ్యమంత్రులు తరలివస్తున్నారు. దాదాపు 5 లక్షల మంది కార్యకర్తలతో బ్రిగేడ్ గ్రౌండ్స్ కాషాయమయంగా మారింది. ముఖ్యమంత్రిగా సువేందు బాధ్యతలు చేపట్టడం ద్వారా బెంగాల్‌లో అభివృద్ధి డబుల్ ఇంజిన్ స్పీడుతో పరుగులు తీస్తుందని జనం ఆశిస్తున్నారు. సువేందు పాలనలో శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేయనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఓటమిని జీర్ణించుకోలేని మమతా బెనర్జీ ఈ గెలుపుపై తీవ్ర ఆరోపణలు గుప్పిస్తున్నారు. సుమారు 93 లక్షల మంది ఓటర్లను జాబితాల నుండి అక్రమంగా తొలగించారని ఆమె వాదిస్తున్నారు. 'సర్' సాఫ్ట్‌వేర్ పేరుతో బీజేపీ దొడ్డిదోవన అధికారం చేజిక్కించుకుందని ఆమె చేస్తున్న విమర్శలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. అయితే ప్రజాస్వామ్యంలో ఓటరు తీర్పే తుది నిర్ణయం. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారమే ఓట్ల లెక్కింపు జరిగిందని బీజేపీ గట్టిగా బదులిస్తోంది. ఓడిపోయిన వారు సాకులు వెతుక్కోవడం సహజమని, ప్రజల మద్దతు లేనిదే ఇంతటి భారీ మెజారిటీ సాధ్యం కాదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆరోపణలు ఎలా ఉన్నా అధికార పీఠం మాత్రం సువేందు వశమైంది. బెంగాల్‌లో సాధించిన ఈ విజయం దక్షిణాది రాష్ట్రాలపై కూడా గట్టి ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా తెలంగాణలో అధికారాన్ని కైవసం చేసుకోవడమే బీజేపీ తదుపరి లక్ష్యం. బెంగాల్ తరహా వ్యూహాన్ని తెలంగాణలో అమలు చేసేందుకు అధిష్టానం సిద్ధమవుతోంది. అక్కడ సువేందు వంటి మాస్ లీడర్‌ను తయారు చేయడంపై ఫోకస్ పెట్టింది. తెలంగాణ బీజేపీ శ్రేణుల్లో ఈ గెలుపు ఒక బూస్టర్ డోస్‌లా పనిచేస్తోంది. కాషాయ జెండాను హైదరాబాద్ గడ్డపై ఎగరేయడానికి ఇప్పటి నుంచే రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. దేశ రాజకీయాల్లో బీజేపీ హవా ఎక్కడా తగ్గలేదని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయి. 4ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని అధికార, విపక్ష పార్టీలు బెంగాల్ ఫలితాలను చూసి అప్రమత్తమయ్యాయి. వైఎస్ఆర్ కాంగ్రెస్, కాంగ్రెస్, బీఆర్ఎస్ వంటి పార్టీలు తమ ఓటు బ్యాంకును కాపాడుకునే పనిలో పడ్డాయి. ముఖ్యంగా ఓటర్ల జాబితాలో 'సర్' టెక్నాలజీతో ఎలాంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఎన్నికల వ్యూహకర్తలతో చర్చలు జరుపుతూ క్షేత్రస్థాయిలో బలాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. బెంగాల్ ఓటమి తృణమూల్ కాంగ్రెస్‌కే కాకుండా ఇతర ప్రాంతీయ పార్టీలకు ఒక హెచ్చరికగా మారింది. తమ కంచుకోటలను కాపాడుకోవడానికి పాత పద్ధతులు వదిలి కొత్త వ్యూహాలు రచించాల్సిన అవసరం ఏర్పడింది. సోషల్ మీడియాలో కూడా ఈ మార్పుపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. బెంగాల్ అంటేనే విప్లవాలకు నిలయం. అటువంటి చోట ఒక జాతీయ పార్టీ జెండా ఎగరేయడం అంటే అదొక సామాజిక మార్పుకు నాంది. గత 45 ఏళ్లుగా అక్కడ కమ్యూనిస్టులు, తృణమూల్ కాంగ్రెస్ మాత్రమే రాజ్యమేలాయి. మార్పును కోరుకున్న యువత, రైతాంగం ఈసారి బీజేపీ వైపు మొగ్గు చూపారు. సువేందు అధికారికి ఉన్న క్లీన్ ఇమేజ్, ఆయన అవివాహిత హోదా అదనపు బలాలుగా మారాయి. అవినీతి రహిత పాలన అందిస్తారనే నమ్మకం ప్రజల్లో కలిగింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడం సువేందు ముందున్న అతిపెద్ద సవాలు. కేంద్ర నిధుల సాయంతో మౌలిక సదుపాయాల కల్పనపై ఆయన దృష్టి సారించే అవకాశం ఉంది. బెంగాల్ ఎన్నికల ఫలితాలు దేశవ్యాప్త పొత్తుల సమీకరణాలను మార్చేయబోతున్నాయి. ప్రతిపక్షాల ఐక్యత అనేది కేవలం కాగితాలకే పరిమితమని ఈ ఓటమి రుజువు చేసింది. బీజేపీని ఎదుర్కోవడానికి ప్రాంతీయ పార్టీలు తమ అజెండాను మార్చుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయఢంకా మోగించడం వల్ల పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, జార్ఖండ్‌లో కూడా దాని ప్రభావం కనిపిస్తోంది. హిందుత్వ అజెండాతో పాటు అభివృద్ధి మంత్రాన్ని జనం స్వీకరిస్తున్నారని స్పష్టమవుతోంది. సువేందు అధికారి ప్రమాణస్వీకారం ఒక వ్యక్తి పట్టాభిషేకం మాత్రమే కాదు, ఒక కొత్త రాజకీయ సిద్ధాంతానికి బెంగాల్‌లో లభించిన గుర్తింపు.

# మోదీకి కవిత బహిరంగ లేఖ

**మొదటిపేజీ తరువాయి**



రాష్ట్ర ప్రయోజనాలు, సామాజిక న్యాయం లక్ష్యంగా నాలుగు ప్రధాన డిమాండ్లను ప్రస్తావిస్తూ ఆమె ఈ లేఖను విడుదల చేశారు. ఒక బాధ్యత కలిగిన పౌరురాలిగా తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రధాని దృష్టికి తీసుకువెళ్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రధాని పర్యటన కేవలం రాజకీయ ప్రసంగాలకు పరిమితం కాకుండా రాష్ట్రానికి చేకూర్చే లబ్ధిపై స్పష్టతనివ్వాలని ఆమె ఆ లేఖ ద్వారా కోరారు. తెలంగాణ సాగునీటి రంగంలో అత్యంత కీలకమైన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలన్నది కవిత లేఖలో మొదటి ప్రధాన డిమాండ్. దశాబ్దాలుగా సాగునీటి కోసం అల్లాడుతున్న ఈ ప్రాంత రైతాంగానికి జలభద్రత కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని ఆమె స్పష్టం చేశారు. సుమారు 33,000కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ భారీ ప్రాజెక్టు ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. జాతీయ హోదా దక్కితే కేంద్రం నుంచి భారీగా నిధులు సమకూరి పనులు వేగవంతం అవుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ ఈ పర్యటనలోనే దీనిపై ప్రధాని ప్రకటన చేయాలని కవిత డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి గణాంకాల అవసరం ఎంతో ఉందని కవిత తన లేఖలో రెండో అంశంగా ప్రస్తావించారు. 2027లో చేపట్టబోయే జనాభా లెక్కల ప్రక్రియలో ప్రత్యేకంగా ఓబీసీ కాలమ్‌ను చేర్చాలని ఆమె విజ్ఞప్తి చేశారు. వెనుకబడిన తరగతుల జనాభా ఎంత ఉందో శాస్త్రీయంగా తేలితేనే వారికి దక్కాల్సిన ఫలాలు అందుతాయని వివరించారు. డేటా ఆధారిత న్యాయం జరిగినప్పుడే సామాజిక సమతుల్యత సాధ్యమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కీలక నిర్ణయం తీసుకోవడం ద్వారా కోట్ల మంది ఓబీసీల జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం కేంద్రానికి ఉందని లేఖలో పేర్కొన్నారు. సామాజిక న్యాయం పట్ల ప్రధానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆమె కోరారు. మహిళా రిజర్వేషన్ల అంశంపై కూడా కవిత తన లేఖలో గట్టిగా గళమెత్తారు. ప్రస్తుతం చర్చల్లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ ఉప కోటాను చేర్చి దానిని తిరిగి ప్రవేశపెట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు. చట్టసభల్లో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించే క్రమంలో వెనుకబడిన తరగతుల మహిళలకు అన్యాయం జరగకూడదన్నదే తన ఉద్దేశమని స్పష్టం చేశారు. లింగ సమానత్వం కేవలం అగ్రవర్ణాలకే పరిమితం కాకుండా అన్ని వర్గాల మహిళలకు దక్కాలని ఆమె ఆకాంక్షించారు. చారిత్రాత్మకమైన ఈ బిల్లులో సవరణలు చేయడం ద్వారా సామాజికంగా వెనుకబడిన మహిళలు కూడా నిర్ణయాధికారంలో భాగస్వాములు అవుతారని వివరించారు. ఈ మార్పు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని కవిత పేర్కొన్నారు. తెలంగాణ శాసన సభ ఆమోదించి పంపిన వెనుకబడిన తరగతుల బిల్లుల అంశాన్ని కూడా కవిత ప్రధాని దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ఈ కీలక బిల్లులకు రాష్ట్రపతి ఆమోద ప్రక్రియను వేగవంతం చేసేలా కేంద్రం చొరవ చూపాలని కోరారు. రాజ్యాంగబద్ధంగా రాష్ట్రాలు తీసుకునే నిర్ణయాలకు కేంద్రం సహకారం అందించడం సమాఖ్య స్ఫూర్తికి నిదర్శనమని గుర్తు చేశారు. ఈ బిల్లుల ఆమోదం పొందితే రాష్ట్రంలోని వెనుకబడిన తరగతులకు విద్య, ఉపాధి రంగాల్లో మరిన్ని అవకాశాలు లభిస్తాయని గణాంకాలతో సహా వివరించారు. రాష్ట్రాల హక్కులను గౌరవిస్తూనే అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించాలని ఆమె ప్రధానిని కోరారు. జలభద్రత, డేటా ఆధారిత న్యాయం, లింగ సమానత్వం, రాజ్యాంగ రక్షణలు అనే నాలుగు అంశాలను పరిష్కరించడం దేశ భవిష్యత్తుకు అత్యంత ఆవశ్యకమని కవిత విశ్లేషించారు. ఈ నాలుగు మూలస్తంభాలు దృఢంగా ఉన్నప్పుడే భారతదేశం ప్రపంచ దేశాల ముందు గర్వంగా నిలబడుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని కేంద్రం అందించాల్సిన సమయం ఆసన్నమైందని లేఖలో గుర్తుచేశారు. ఒకవైపు రాష్ట్ర ప్రయోజనాలు, మరోవైపు సామాజిక న్యాయం రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రధాని తన పర్యటనలో సానుకూల నిర్ణయాలు ప్రకటిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన రాజకీయ పక్షంగా తాము ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడతామని కవిత స్పష్టం చేశారు. ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా పరేడ్ మైదానంలో నిర్వహించే సభలో రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ అంశాలపై స్పష్టత వస్తుందని ప్రజలు ఎదురుచూస్తున్నట్లు కవిత పేర్కొన్నారు. విభజన చట్టంలోని హామీలతో పాటు పాలమూరు ప్రాంతానికి సాగునీటి కష్టాలు తీర్చేలా కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందాలని కోరారు. సుమారు 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో నిర్మిస్తున్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్ర హోదా దక్కకపోవడం పట్ల గతంలో అనేక నిరసనలు వ్యక్తమయ్యాయి. ఇప్పుడు అదే ప్రాంతానికి చెందిన నేతగా కవిత ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో లేఖలో పొందుపరిచారు. ఈ పర్యటన రాష్ట్రానికి వరంగా మారాలని ఆమె ఆకాంక్షించారు. సామాజిక న్యాయ సాధనలో భాగంగా ఓబీసీల సంక్షేమం కోసం కేంద్రం తీసుకోవాల్సిన చర్యలను కవిత సోదాహరణంగా వివరించారు. దేశంలో జనాభా ప్రాతిపదికన వెనుకబడిన తరగతులకు కేటాయింపులు జరగాలంటే జనాభా గణనలో స్పష్టత ఉండాలని పట్టుబట్టారు. గతంలో అనేక సందర్భాల్లో ఓబీసీ సంఘాలు చేసిన విన్నపాలను కేంద్రం పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. 2027 జనాభా లెక్కలు భారత సామాజిక ముఖచిత్రాన్ని మార్చే విధంగా ఉండాలని ఆమె ఆ లేఖలో ఆకాంక్షించారు. నిధుల కేటాయింపులో గానీ, పదవుల భర్తీలో గానీ జనాభా నిష్పత్తిని పాటించడం ద్వారానే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమని కవిత లేఖలో గట్టిగా వినిపించారు. మహిళా శక్తిని గౌరవిస్తూనే అందులో సామాజిక న్యాయాన్ని వెతకడం ఈ లేఖలోని ప్రధాన ఉద్దేశమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళలకు ప్రత్యేక కోటా కల్పించడం వల్ల అణగారిన వర్గాల నుంచి నాయకత్వం పుట్టుకొస్తుందని కవిత విశ్వాసం వ్యక్తం చేశారు. కేవలం నినాదాలకే పరిమితం కాకుండా చట్టబద్ధంగా వారికి రక్షణ కల్పించాలని కోరారు. 33 శాతం రిజర్వేషన్లలో ఉప కోటా ఉంటేనే గ్రామీణ స్థాయి నుంచి మహిళా నేతలు చట్టసభలకు ఎన్నికయ్యే అవకాశం ఉంటుందని గణాంకాలతో వివరించారు. ఈ విషయంలో కేంద్రం చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఆమె ప్రధానిని డిమాండ్ చేశారు. లేఖలో ప్రస్తావించిన నాలుగు అంశాలు కేవలం తెలంగాణకే పరిమితం కాకుండా దేశ వ్యాప్త ప్రభావం చూపేవిగా ఉన్నాయని కవిత అభిప్రాయపడ్డారు. సమాఖ్య వ్యవస్థలో కేంద్ర రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు ఉండాలని కోరుకుంటూనే రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో లేవనెత్తిన ఈ ప్రశ్నలు ఇప్పుడు సోషల్ మీడియాలో సైతం ట్రెండింగ్‌గా మారాయి. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా తాను ఈ లేఖ రాసినట్లు కవిత పేర్కొన్నారు. ప్రధాని మోదీ తన ప్రసంగంలో ఈ అభ్యర్థనలపై సానుకూల స్పందన ఇస్తారని తెలంగాణ రక్షణ సేన శ్రేణులు ఆశిస్తున్నాయి.

# మన్యంపై మలేరియా పంజా

- పదేళ్లలో మలేరియా కేసులు 14 వేల నుండి వందల్లోకి తగ్గాయి
- భద్రాద్రి, ములుగు వంటి మన్యం జిల్లాల్లో ఇంకా కేసుల ముప్పు
- పారిశుధ్య లోపం, అటవీ ప్రాంతాల్లో దోమల సంతానోత్పత్తి
- 2030 నాటికి మలేరియా రహిత తెలంగాణే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
- ఏజెన్సీలో మొబైల్ టీమ్స్, ప్రతి శుక్రవారం 'డ్రై డే' అమలు
- నీరు నిల్వ ఉండకుండా చూడటం, మస్కిటో నెట్స్ వాడటం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ గడ్డపై మలేరియా మహమ్మారి ఉధృతి గత దశాబ్ద కాలంతో పోలిస్తే గణనీయంగా తగ్గుముఖం పట్టినప్పటికీ మారుమూల అటవీ ప్రాంతాల్లో మాత్రం ఈ విషజ్వరం ఇంకా తన ప్రతాపాన్ని చూపిస్తూనే ఉంది. రాష్ట్రవ్యాప్తంగా కేసుల గ్రాఫ్ పడిపోతున్నా మన్యం జిల్లాలైన భద్రాద్రి కొత్తగూడెం, కొమురం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, ములుగు ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. అటవీ భౌగోళిక పరిస్థితులు, పారిశుధ్య నిర్వహణలో లోపాలు వెరసి దోమల సంతానోత్పత్తికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. ఫలితంగా ఏజెన్సీ వాసులు జ్వరాల బారిన పడి మంచాన పడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. అదుపులోకి వచ్చాయనుకుంటున్న తరుణంలోనే మళ్ళీ కొత్త కేసులు వెలుగుచూడటం అధికార యంత్రాంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రాష్ట్రంలోని గడచిన ఐదేళ్ల గణాంకాలను విశ్లేషిస్తే మలేరియా వ్యాప్తిలో 70 శాతం మేర తగ్గుదల కనిపించడం ఊరటనిచ్చే అంశం. అయినప్పటికీ అటవీ ప్రాంతాల్లో వలస కార్మికుల రాకపోకలు పెరగడం వైరస్ వ్యాప్తికి ప్రధాన వాహకాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల నుంచి వచ్చే కూలీల ద్వారా వ్యాధి సంక్రమణ జరుగుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అటవీ గ్రామాల్లో నిల్వ ఉండే నీరు, మురుగు కాలువల నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల అనాఫిలిస్ దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో సామాన్యుల ఆరోగ్యం గాలిలో దీపంలా మారుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ ఏడాది ఇప్పటికే 21 కేసులు నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. జిల్లాలో సుమారు 160 గ్రామాలను హైరిస్క్ జోన్లుగా గుర్తించిన అధికారులు అక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. దోమల నివారణలో అత్యంత కీలకమైన 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమం క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదన్న విమర్శలు విన్పిస్తున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ స్పందిస్తూ గిరిజన ప్రాంతాల్లో ఫాగింగ్ చర్యలను ముమ్మరం చేశామని చెపుతున్నారు. నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించకపోతే పరిస్థితి విషమించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. మలేరియా నివారణ కోసం గతంలో అమలైన ఇంటింటి రక్తనమూనాల సేకరణ ప్రక్రియ ప్రస్తుతం మందగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆరోగ్య కార్యకర్తలు నేరుగా బాధితుల వద్దకు వెళ్లి స్లైడ్స్ సేకరించే విధానం అటకెక్కిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ములుగు, భూపాలపల్లి వంటి జిల్లాల్లో గతేడాది ఎంజీఎం ఆస్పత్రిలో 146 మంది చికిత్స పొందగా ఈ ఏడాది ఇప్పటికే ఆ సంఖ్య 37కు చేరింది. ములుగు జిల్లాలో గతేడాది అత్యధికంగా 44 కేసులు వెలుగుచూడటం అక్కడి పారిశుధ్య వైఫల్యాన్ని ఎత్తి చూపుతోంది. నివారణ చర్యలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు కావాల్సి ఉంది. తెలంగాణ ఏర్పడిన కొత్తలో అంటే 2014 సంవత్సరంలో మలేరియా కేసుల సంఖ్య ఏకంగా 14,000గా ఉండేది. ప్రభుత్వ నిరంతర కృషి ఫలితంగా 2018 నాటికి ఆ సంఖ్య 2,500కి పడిపోయింది. 2024లో 261 కేసులు, 2025లో 270 కేసులు నమోదయ్యాయి. ప్రస్తుత 2026 మే మాసం వరకు కేసులు నియంత్రణలోనే ఉన్నప్పటికీ వర్షాకాలం రానుండటంతో గండం పొంచి ఉందని చెప్పవచ్చు. వైద్యశాఖ అధికారి డాక్టర్ అల్లెం అప్పయ్య వివరించినట్లుగా 'టెస్ట్ ట్రీట్ ట్రాక్' వ్యూహం ద్వారా కేసుల సంఖ్యను గణనీయంగా తగ్గించగలిగారు. 11 జిల్లాల్లో ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం 2030 నాటికి మలేరియా రహిత తెలంగాణను ఆవిష్కరించాలనే ప్రతిష్ఠాత్మక లక్ష్యంతో ముందుకు సాగుతోంది. యుద్ధ ప్రాతిపదికన వైద్య విభాగం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని అధికారులు భావిస్తున్నారు. హైదరాబాద్ సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ నందికూరి వినయ్ కుమార్ అభిప్రాయం ప్రకారం దేశవ్యాప్తంగా మలేరియాను పారదోలడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాల్సి ఉంటుంది. కేసులు తగ్గాయని అలసత్వం ప్రదర్శించకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచిస్తున్నారు. ఒక్కోసారి వైరస్ మ్యుటేషన్ చెందే అవకాశం ఉన్నందున శాస్త్రీయ పరిశోధనలు సైతం వేగవంతం చేయాలి. నగర ప్రాంతాల్లో ముఖ్యంగా మల్కాజిగిరి వంటి రద్దీ ప్రదేశాల్లో దోమల నివారణకు అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. మురుగునీటి కాల్వల్లో ఆయిల్ బాల్స్ వేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. అయితే కేవలం అధికారుల మీదనే భారం వేయకుండా ప్రజలు సైతం తమ వంతు బాధ్యతను గుర్తించాలని సీసీఎంబీ సీఈఓ డాక్టర్ ఎన్ మధుసూదన్ రావు పేర్కొన్నారు. ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల దోమల సంతానోత్పత్తి సామర్థ్యం పెరుగుతోందని దీనిని దృష్టిలో ఉంచుకుని నివారణ చర్యలు ప్లాన్ చేసుకోవాలని ఆయన హితవు పలికారు. హైదరాబాద్ మహానగరంలో నిర్మాణ రంగంలో పనిచేసే వలస కార్మికుల వల్ల ఫాల్సిపేరమ్ మలేరియా ముప్పు పొంచి ఉందని ఆరోగ్య శాఖ హెచ్చరిస్తోంది. ఈ రకం మలేరియా ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉన్నందున నిర్మాణ ప్రదేశాల వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మస్కిటో నెట్ల పంపిణీతో పాటు ఫీవర్ సర్వైలెన్స్ ముమ్మరం చేయాలని ప్రజలు కోరుతున్నారు. చిన్న చిన్న నీటి గుంటలే దోమలకి నిలయాలుగా మారుతున్నాయని వీటిని అరికట్టడంలో నిర్లక్ష్యం వహిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరికలు జారీ అవుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియాను సమూలంగా తుడిచిపెట్టేందుకు ప్రత్యేక మొబైల్ హెల్త్ టీమ్స్ రంగంలోకి దిగాయి. భద్రాద్రి, ఆసిఫాబాద్ వంటి జిల్లాల్లో ర్యాపిడ్ డయాగ్నోస్టిక్ కిట్స్ అందుబాటులో ఉంచారు. ఇవి కేవలం 20 నిమిషాల లోపే ఫలితాన్ని వెల్లడించడంతో తక్షణ చికిత్స అందించే వీలు కలుగుతోంది. ముఖ్యంగా గిరిజన గూడాల్లోని గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక నిఘా పెట్టారు. గిరిజన భాషల్లోనే అవగాహన కల్పిస్తూ దోమతెరల వినియోగంపై చైతన్యం తీసుకువస్తున్నారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి వచ్చే వ్యక్తులకు థర్మల్ స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు. దోమల నివారణలో ప్రజల భాగస్వామ్యం లేనిదే ఏ లక్ష్యం నెరవేరదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడం ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించాలి. రాత్రి సమయాల్లో తప్పనిసరిగా దోమతెరలు వాడటం ద్వారా వ్యాధి ముప్పు నుంచి తప్పించుకోవచ్చు. జ్వరం వచ్చిన వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. స్వయం వైద్యం ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉన్నందున అప్రమత్తత అవసరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చూస్తే తెలంగాణలో మలేరియా పీడ విముక్తి దిశగా అడుగులు పడుతున్నా ఏజెన్సీ ప్రాంతాలు మాత్రం ఇంకా సవాళ్లను విసురుతూనే ఉన్నాయి. వర్షాకాలం సమీపిస్తున్న వేళ అధికారులు పాత పద్ధతులకు స్వస్తి పలికి అధునాతన సాంకేతికతతో దోమలను ఎదుర్కోవాలి. గ్రామ సర్పంచ్ నుంచి కలెక్టర్ వరకు ప్రతి ఒక్కరు ఈ లక్ష్యంలో భాగస్వాములు కావాలి. ప్రజలు, ప్రభుత్వం చేతులు కలిపితేనే 2030 నాటికి 'మలేరియా రహిత తెలంగాణ' స్వప్నం సాకారమవుతుంది. ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఇంటి చుట్టూ పరిశుభ్రతను ఒక ఉద్యమంలా చేపట్టాల్సిన సమయం ఆసన్నమైంది.

# సమరోత్సాహంతో తెలంగాణకు మోడీ !



**మొదటిపేజీ తరువాయి**

పీఠాలను తన ఖాతాలో వేసుకుంది. ఈ భారీ విజయాల ఊపుతోనే 2028 లక్ష్యంగా బీజేపీ ఇప్పటి నుంచే గ్రాండ్ ప్రిపరేషన్ మొదలుపెట్టింది. ఈ క్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. మోదీ తాజా పర్యటన వెనుక అనేక ఆసక్తికరమైన అంశాలు దాగి ఉన్నాయి. మూడవసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన తెలంగాణకు రావడం ఇదే మొదటిసారి. పశ్చిమ బెంగాల్ పీఠాన్ని దక్కించుకున్న ఉత్సాహంలో ఉన్న ప్రధానికి ఇక్కడ ఘన స్వాగతం పలకనున్నారు. బీజేపీ అగ్రనేతలకు సవాల్‌గా నిలిచిన మమతా బెనర్జీని మట్టికరిపించిన సంతోషం పార్టీ క్యాడర్‌లో ఉరకలెత్తుతోంది. మే 9వ తేదీన బెంగాల్ కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్న ప్రధాని.. అక్కడి నుంచి నేరుగా భాగ్యనగరానికి రానున్నారు. బెంగాల్ విజయ స్ఫూర్తిని తెలంగాణ నేతలకు నూరిపోసి.. భవిష్యత్తు పోరాటాలకు వారిని సమాయత్తం చేయడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం. ప్రధాని పర్యటన షెడ్యూల్ ఇప్పటికే ఖరారైంది. ఢిల్లీలోని పీఎంఓ కార్యాలయం వెల్లడించిన వివరాల ప్రకారం.. మోదీ బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ చేరుకుంటారు. అభివృద్ధి మంత్రమే లక్ష్యంగా సాగే ఈ పర్యటనలో హెచ్ఐసీసీ వేదికగా పలు ప్రాజెక్టులకు ఆయన పచ్చజెండా ఊపనున్నారు. సుమారు తొమ్మిది వేల కోట్ల రూపాయల విలువైన భారీ ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టబోతున్నారు. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు తెలంగాణ ప్రగతికి కేంద్రం ఎంత ప్రాధాన్యత ఇస్తుందో ఈ నిధుల కేటాయింపు ద్వారా స్పష్టం చేయనున్నారు. ప్రభుత్వ పరంగా అభివృద్ధి పనులను పూర్తి చేస్తూనే.. రాజకీయంగా పార్టీకి ఊపునిచ్చేలా ఆయన ప్రసంగం సాగనుంది. నేడు సాయంత్రం హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న బహిరంగ సభపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇటీవల ఢిల్లీలో జరిగిన పార్టీ విజయోత్సవ సభల్లో వివిధ రాష్ట్రాల్లో బీజేపీ సాధిస్తున్న విజయాలను మోదీ ప్రస్తావించారు. దక్షిణాదిలో కర్ణాటక తర్వాత తెలంగాణను బలమైన స్థావరంగా మార్చుకోవాలని ఆయన కృతనిశ్చయంతో ఉన్నారు. తెలంగాణను దక్కించుకోవాలన్న పట్టుదలతో ఉన్న బీజేపీ.. ప్రజలను ఆకట్టుకునేలా.. కార్యకర్తలను ఉత్తేజపరిచేలా మోదీతో పవర్‌ఫుల్ స్పీచ్ సిద్ధం చేయించింది. రాష్ట్ర అభివృద్ధి వేగవంతం కావాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ ఎంత అవసరమో ఆయన వివరించబోతున్నారు. సభ అనంతరం బేగంపేట విమానాశ్రయం నుంచి ఆయన నేరుగా ఢిల్లీకి పయనమవుతారు. పరేడ్ గ్రౌండ్స్ సభ కోసం బీజేపీ శ్రేణులు కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేశాయి. రాష్ట్రం నలుమూలల నుంచి కార్యకర్తలను తరలించి తమ బలాన్ని చాటుకోవాలని చూస్తున్నాయి. అధికార కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు.. గత బీఆర్ఎస్ పాలనలోని లోపాలను కూడా ప్రస్తావించే అవకాశం ఉంది. అభివృద్ధి పథకాలతో పాటు రాజకీయ విమర్శల డోస్ కూడా గట్టిగానే ఉండబోతోంది. బెంగాల్ ఫలితాల తర్వాత మోదీ వస్తుండటంతో.. తెలంగాణలో కూడా అదే ఫలితం పునరావృతం అవుతుందనే ధీమాను ఆయన వ్యక్తం చేయనున్నారు. ఈ పర్యటనతో తెలంగాణ రాజకీయాల్లో నయా జోష్ రావడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. మోదీ పర్యటన నేపథ్యంలో భాగ్యనగరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. వేల సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూనే ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. బీజేపీ అగ్ర నాయకత్వం అంతా హైదరాబాద్‌లోనే మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. ఢిల్లీ నుంచి గల్లీ దాకా అంతా కాషాయమయంగా కనిపిస్తోంది. కేవలం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవమే కాకుండా.. రాబోయే ఎన్నికలకు శంఖారావం పూరించడం ఈ పర్యటన పరమార్థం. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే శక్తి కేవలం తమకే ఉందన్న భరోసాను కల్పించేందుకు మోదీ సిద్ధమయ్యారు. తెలంగాణ గడ్డపై బీజేపీ అడుగులు ఇప్పుడు మరింత వేగవంతమయ్యాయి. గతంలో చేసిన పొరపాట్లను సరిదిద్దుకుంటూ కొత్త వ్యూహాలతో ముందుకు సాగుతోంది. స్థానిక సమస్యలపై పోరాటాలు చేస్తూనే.. జాతీయ స్థాయి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తోంది. మోదీ చరిష్మాను వాడుకుంటూనే క్షేత్రస్థాయిలో బూత్ కమిటీలను బలోపేతం చేస్తోంది. పశ్చిమ బెంగాల్ తరహాలోనే ఇక్కడ కూడా అధికార మార్పిడి జరుగుతుందని ఆ పార్టీ నమ్ముతోంది. 2028లో తెలంగాణ గడ్డపై కాషాయ జెండా ఎగరడం ఖాయమనే సంకేతాలను ఈ సభ ద్వారా పంపబోతున్నారు. రెండు దశాబ్దాల క్రితం తెలంగాణ ఉద్యమం సమయంలో బీజేపీ చూపిన చొరవను ఇప్పుడు రాజకీయ పెట్టుబడిగా మార్చుకోవాలని చూస్తోంది. సోషల్ మీడియా వేదికగా యువతను ఆకట్టుకుంటూనే.. సంక్షేమ పథకాల లబ్ధిదారులతో మమేకమవుతోంది.

# త్వరలో సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




హైదరాబాద్ మహానగరాన్ని ట్రాఫిక్ రహిత స్వర్గధామంగా మార్చేందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సరికొత్త ప్రణాళికలతో సిద్ధమయ్యారు. శనివారం సచివాలయంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ భేటీలో పాల్గొన్న ఆయన నగర భవిష్యత్తును సరికొత్తగా ఆవిష్కరించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు చెందిన కీలక విభాగాధిపతులతో నిర్వహించిన ఈ హైలెవల్ మీటింగ్‌లో 'పట్టణాల ఆధునికీరణ, రాబోయే సవాళ్లు' అనే అంశంపై లోతైన మంతనాలు సాగించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనలో వెనుకబడితే నగరం ఊపిరాడని స్థితికి చేరుకుంటుందని ఆయన హెచ్చరించారు. భాగ్యనగర వీధుల్లో వాహనాల రణగొణ ధ్వనులను తగ్గించి సిగ్నల్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రేవంత్ ఉద్ఘాటించారు. కేవలం రోడ్ల వెడల్పుతోనే సమస్యలు తీరవని గ్రహించిన యంత్రాంగం సరికొత్త మౌలిక వసతుల వ్యూహాన్ని అమలు చేయబోతోంది. ప్రతి కూడలి వద్ద ఎక్కడా వాహనాలు ఆగకుండా సాఫీగా సాగిపోయేలా డిజైన్లను రూపొందిస్తున్నారు. గ్లోబల్ సిటీల తరహాలో ఇక్కడ ప్రయాణం సాఫీగా సాగేలా అధునాతన సాంకేతికతను జోడించనున్నారు. సిగ్నల్ వ్యవస్థ లేని నగరంగా హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలబెట్టేందుకు కసరత్తు ముమ్మరం చేశారు. నగర రవాణా వ్యవస్థలో విప్లవాత్మకమైన త్రీలెవల్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా భూగర్భంలో అండర్ పాస్‌లు, భూ ఉపరితల మార్గాలు, ఆకాశ మార్గంలో ఎలివేటెడ్ కారిడార్లను అనుసంధానించనున్నారు. ఈ త్రీలెవల్ స్ట్రాటజీ వల్ల వాహన చోదకులకు అడ్డంకులు లేకుండా గమ్యస్థానాలకు చేరుకునే వీలు కలుగుతుంది. ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని ఛేదించేందుకు ఈ మల్టీ డైమెన్షనల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కీలక పాత్ర పోషించనుంది. భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఈ నిర్మాణాలను అత్యంత పటిష్టంగా నిర్మించేందుకు ఇంజనీరింగ్ నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నారు. రవాణా రద్దీని తగ్గించడంలో మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ అత్యంత ఆవశ్యకమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. బస్సులు, మెట్రో రైళ్లు, ఇతర ప్రైవేటు వాహనాల మధ్య సరైన సమన్వయం ఉండేలా రవాణా రంగంలో సంస్కరణలు తీసుకువస్తున్నారు. ప్రయాణికులు ఒక చోటు నుంచి మరో చోటుకు మారేటప్పుడు ఎక్కడా అసౌకర్యం కలగకుండా ఇంటిగ్రేటెడ్ హబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రజలు సొంత వాహనాల కంటే ప్రజా రవాణానే ఎక్కువగా ఇష్టపడేలా సౌకర్యాలను మెరుగుపరచడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం. దీనివల్ల రోడ్లపై వాహనాల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది. పట్టణాల్లో మరో ప్రధాన సమస్యగా మారిన పార్కింగ్ ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. నగరంలోని అత్యంత రద్దీగా ఉండే వ్యాపార సముదాయాలు, కార్యాలయాల సమీపంలో మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాలను నిర్మించబోతున్నారు. రోడ్ల పక్కన అడ్డదిడ్డంగా పార్క్ చేసే వాహనాల వల్ల సగానికి పైగా రహదారి ఆక్రమణకు గురవుతోంది. దీన్ని అరికట్టేందుకు స్మార్ట్ పార్కింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ అందుబాటులోకి తీసుకువస్తున్నారు. వాహనదారులు తమ ఫోన్లలోనే ఖాళీ ఉన్న పార్కింగ్ స్లాట్లను చూసుకునేలా యాప్‌ను సైతం అనుసంధానిస్తారు. తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్రాన్ని క్యూర్ , రేర్ , ప్యూర్ అనే మూడు విభాగాలుగా వర్గీకరించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న క్యూర్ ఏరియాను సంపూర్ణంగా సర్వీసు సెక్టార్ హబ్‌గా అభివృద్ధి చేస్తారు. ఇక్కడ ప్రధానంగా ఐటీ, బ్యాంకింగ్, పర్యాటక రంగాలకు పెద్దపీట వేయనున్నారు. పట్టణ జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ అత్యున్నత స్థాయి సదుపాయాలను ఈ జోన్ పరిధిలో కల్పిస్తారు. ఉపాధి అవకాశాలను పెంచుతూనే నగర జీవనాన్ని ఆహ్లాదకరంగా మార్చేందుకు ఈ ప్లాన్ దోహదపడుతుంది. ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల నుంచి రీజనల్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ఏరియాను ప్యూర్ జోన్‌గా గుర్తించారు. దీనిని పూర్తిస్థాయిలో మాన్యుఫ్యాక్షరింగ్ సెక్టార్‌కు కేటాయించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. కాలుష్య రహిత పరిశ్రమలను ఇక్కడ ప్రోత్సహించడం ద్వారా భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించనున్నారు. ప్రపంచ స్థాయి కంపెనీలు తమ తయారీ కేంద్రాలను ఇక్కడ నెలకొల్పేందుకు అవసరమైన భూమి, విద్యుత్తు, నీటి వసతులను కల్పించబోతున్నారు. తద్వారా స్థానిక యువతకు వేల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభించే ఆస్కారం ఉంది. రీజనల్ రింగ్ రోడ్డు ఆవల ఉన్న విశాలమైన రేర్ ఏరియాను అగ్రికల్చర్ సెక్టార్‌గా అభివృద్ధి చేయనున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం దీని లక్ష్యం. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఇక్కడ పెద్ద ఎత్తున ఏర్పాటు చేయబోతున్నారు. పట్టణీకరణ ప్రభావం సాగు భూములపై పడకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించనున్నారు. పల్లెటూరి పచ్చదనాన్ని కాపాడుకుంటూనే ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ఈ జోన్ రూపుదిద్దుకోనుంది. రాష్ట్ర ప్రగతి రథానికి దిక్సూచిగా 'తెలంగాణ రైజింగ్ 2047' మాస్టర్ ప్లాన్‌ను రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. వచ్చే పాతికేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ సమగ్ర ప్రణాళికను రూపొందించారు. కేవలం నగరాభివృద్ధి మాత్రమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు ఈ ప్లాన్‌లో అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. చారిత్రాత్మక మూసీ నది పునరుజ్జీవం ఈ మాస్టర్ ప్లాన్‌లో కీలక ఘట్టం. మూసీ తీరాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా మార్చడంతో పాటు మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా తీర్చిదిద్దనున్నారు. నగరంలో పెరుగుతున్న కాలుష్యానికి అడ్డుకట్ట వేసేందుకు విద్యుత్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆర్టీసీలో భారీ సంఖ్యలో ఈవీ బస్సులను ప్రవేశపెడుతున్నారు. డీజిల్ వాహనాల వల్ల వెలువడే పొగ నుంచి నగర ప్రజలకు విముక్తి కల్పించాలన్నది ప్రభుత్వ సంకల్పం. కోర్ అర్బన్ ప్రాంతంలో తిరిగే పాత ఆటోల స్థానంలో కొత్త టెక్నాలజీని తీసుకువస్తున్నారు. ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి వాటిని ఈవీలుగా మార్చేందుకు ప్రభుత్వం భారీ రాయితీలను ప్రకటిస్తోంది. దీనివల్ల అటు పర్యావరణం, ఇటు ఆటో డ్రైవర్ల ఆర్థిక స్థితి మెరుగుపడతాయి. సచివాలయంలో జరిగిన ఈ మేధోమథనంలో అధికారులు పట్టణాభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తాగునీటి సరఫరా వ్యవస్థలో చేయాల్సిన మార్పులు, డ్రైనేజీ నెట్‌వర్క్ ఆధునీకరణపై లోతైన చర్చలు జరిపారు. మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టు ఏ విధంగా ఉండబోతుందో విజువల్స్ ద్వారా వివరించారు. కేంద్ర కమిటీ సభ్యులు తెలంగాణ ప్రభుత్వ ఆలోచనలను, ప్రణాళికలను ప్రశంసించారు. అద్భుతమైన మౌలిక సదుపాయాలతో హైదరాబాద్‌ను గ్లోబల్ డెస్టినేషన్‌గా మార్చే ప్రక్రియలో తాము కూడా సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ భేటీ నగరాభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలవనుంది.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



**కురవి, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం జుజుర్ తండా గ్రామ వార్డు సభ్యురాలు బానోత్ రంగి లచ్చిరాం ల కుమార్తె శ్రావణి సాయిరాం ల వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, బి ఆర్ ఎస్ జిల్లా సీనియర్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, బి ఆర్ ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు గుగులోత్ రవి నాయక్, స్థానిక ఉపసర్పంచ్ దారావత్ శరత్, తిరుపతి, సెట్ రాం దేవేందర్, వీరన్న కిషన్ బాబురావు మంగ్య తదితరులు పాల్గొన్నారు.

## నవ దంపతులను ఆశీర్వదించిన మాజీ మంత్రి



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్ల గ్రామంలో ముదిరాల విరస్వామి లలిత దంపతుల కుమార్తె అఖిల మరియు నవదీప్‌ల వివాహ వేడుక శనివారం అత్యంత వైభవంగా, ఆనందోత్సాహాల నడుమ జరిగింది. గ్రామంలో పండుగ వాతావరణాన్ని తలపించేలా జరిగిన ఈ శుభకార్యానికి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కళ్యాణ మండపానికి చేరుకున్న సత్యవతి రాథోడ్ గారికి కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదికపైకి వెళ్లిన ఆమె అఖిల, నవదీప్‌లను ఆప్యాయంగా పలకరించి అక్షింతలు వేసి ఆశీస్సులు అందించారు. కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న ఈ జంట పరస్పర ప్రేమాభిమానాలతో, సుఖ సంతోషాలతో నిండిన దాంపత్య జీవితం గడపాలని ఆకాంక్షించారు. "కుటుంబ బంధాలు, సంప్రదాయాలు సమాజానికి బలమైన ఆధారం" అని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ వివాహ మహోత్సవంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు సహదేవ్, కుమ్మరికుంట్ల సర్పంచ్ సాయి దుర్గ అనిల్, ఉపసర్పంచ్ దైద ఉప్పలయ్యతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, బంధుమిత్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకలో సంప్రదాయ సంగీతం, కుటుంబ సభ్యుల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామ పెద్దలు మాట్లాడుతూ అఖిలనవదీప్‌ల వివాహం రెండు కుటుంబాల ఆనందాన్ని మరింత పెంచిందని పేర్కొన్నారు. వివాహానికి విచ్చేసిన అతిథులకు కుటుంబ సభ్యులు ప్రత్యేక విందు ఏర్పాటు చేసి ఆతిథ్యమిచ్చారు. మొత్తం కార్యక్రమం ఆధ్యాత్మికత, ఆనందం, ఆత్మీయతల సమ్మేళనంగా కొనసాగింది.

## గోపా నాయక్ జ్ఞాపకార్థంగా కుటుంబానికి ఆర్థిక సాయం

**కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ డాక్టర్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీరన్న నాయక్**



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మోదుగుల గూడెం గ్రామానికి చెందిన కందిపటి ఉప్పలమ్మ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డాక్టర్స్ వింగ్ నాయకుడు డాక్టర్ వీరన్న నాయక్ రూ.2,000 ఆర్థిక సాయం అందించారు. డాక్టర్ వీరన్న నాయక్ వ్యక్తిగతంగా హాజరు కాలేకపోయినా, మోదుగుల గూడెం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ చింతమల్ల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు వెళ్లి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చింతమల్ల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, డాక్టర్ వీరన్న నాయక్ తమ తండ్రి గోపా నాయక్ జ్ఞాపకార్థంగా మోదుగుల గూడెం ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలో ఇప్పటివరకు దాదాపు 10 కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షిస్తూ డాక్టర్ వీరన్న నాయక్‌కు గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## కంబాలపల్లిలో సమ్మర్ క్యాంప్ ప్రారంభం



**మహబూబాబాద్, విశాలభారతి:** మానుకోట మండలం కంబాలపల్లి గ్రామంలోని పీఎం శ్రీ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఈ నెల 11వ తేదీ నుండి 25వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయులు కె.గిరిజ తెలిపారు. పాఠశాల విద్యార్థులతో పాటు గ్రామం మరియు పరిసర ప్రాంతాల విద్యార్థులు కూడా ఈ క్యాంపులో పాల్గొనాలని ఆమె కోరారు. ఈ సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు సృజనాత్మకత అభివృద్ధికి తోడ్పడే విధంగా మ్యూజిక్, యోగా, పెయింటింగ్, ఆర్ట్, డ్రాయింగ్, కంప్యూటర్ శిక్షణ, గణితం, క్రీడలు, ఇండోర్ గేమ్స్, మాక్ పార్లమెంట్ తదితర అంశాలలో ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు క్యాంప్ నిర్వహించబడుతుందని, పాల్గొనే విద్యార్థులకు స్నాక్స్ కూడా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ సమ్మర్ క్యాంపుకు పంపించి వారి ప్రతిభను మెరుగుపర్చే అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రధానోపాధ్యాయులు కోరారు.

## తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్ దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు



**మోత్కూరు, విశాలభారతి:** తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ యాదమ్మ దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా శనివారం హైదరాబాద్ లోని ఎమ్మెల్యే నివాసంలో మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య దంపతులు మొక్కను అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆమె వెంట మండల కాంగ్రెస్ నాయకులు బద్దం నాగార్జున్ రెడ్డి,ఎడ్ల శ్రీను,నరేష్, నాగులు,గడ్డం లక్ష్మయ్య, జిట్ట రాములు కందుకూరి మురళి,గడ్డం రమేష్,కందుకూరి నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ను ఢీ కొట్టిన కారు

**దేవరుప్పుల విశాలభారతి:** మండలం,సింగరాజుపల్లి గ్రామంలో ఉన్న ఫంక్షన్ హాల్ లో జోగు సోమయ్య కుమారుని పెళ్లి నేడు 9న ఉండగా సోమయ్య,బోరెల్లి మునయ్య ఇద్దరు కలిసి ట్రాక్టర్ లో సామాన్లను నిన్న సాయంత్రం సింగరాజు పెళ్లికి తరలిస్తుండగా సింగరాజుపల్లి ప్రధాన రహదారి దుర్గమ్మ గుడి దగ్గరికి రాగా జనగామ నుండి సూర్యాపేట వైపు వెళ్తున్న బెలోనో కారు నడుపుతున్న వ్యక్తి అతివేగంగా వచ్చి ట్రాక్టర్ ను వెనకనుండి ఢీ కొట్టగా ట్రాక్టర్ బోర్లా పడి అందులో కూర్చున్న సోమయ్య తలకు దెబ్బలు తగలగా,డ్రైవర్ జిగిరి మల్లయ్యకు,పక్కన కూర్చున్న మునయ్యకు కూడా దెబ్బలు తగలగా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సోమయ్య మరణించాడని ఆసుపత్రి వైద్యుడు తెలుపగా కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.కారు డ్రైవర్ పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని ఆమె భార్య జోగు దుర్గమ్మ స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సృజన్ కుమార్ తెలిపారు.అందులో భాగంగానే ఈ రోజు సంఘటన స్థలానికి చేరుకున్న వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య,పాలకుర్తి సీఐ జానకీ రాంరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి యాక్సిడెంట్ కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.



# ఎల్లంపేటలో వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవం

- **ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్**
- **గ్రామ సుభిక్షం కోసం దేవతల ఆశీస్సులు కోరిన మాజీ మంత్రి**

**మహబూబాబాద్, విశాలభారతి:**



మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ ఉమామహేశ్వర స్వామి, ధ్వజస్తంభ, గణపతి, పార్వతి, సుబ్రహ్మణ్యేశ్వర, నవగ్రహ సహిత గ్రామదేవత నాభిశిల బొడ్రాయి మరియు భూలక్ష్మి శ్రీ లక్ష్మీ సమేత ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా కొనసాగుతోంది. ఈ మహోత్సవంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆలయానికి చేరుకున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌కు గ్రామస్తులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. అనంతరం ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామదేవతల ఆశీస్సులు తీసుకున్నారు. గ్రామ ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని, పంటలు పుష్కలంగా పండాలని, యువత మంచి భవిష్యత్తు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ గ్రామ సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామ దేవతల పూజలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని, ఇటువంటి మహోత్సవాలు యువతకు భారతీయ సంస్కృతిని పరిచయం చేస్తాయని అన్నారు. గ్రామ ప్రజలు ఐకమత్యంతో అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో బోడ శ్రీను నాయక్, స్థానిక సర్పంచ్ గండి రాధమ్మ, వెన్నె వీరయ్య, గర్రెపల్లి తాళ్లపల్లి రఘు, గండి మహేష్, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల రద్దీతో ఎల్లంపేట గ్రామం పండుగ వాతావరణాన్ని తలపించింది.

## చట్టం ముందు అందరూ సమానంగా ఉండాలి

- **పేదలకు ఒక న్యాయం.. పెద్దలకు మరో న్యాయం తగదు**
- **సమాన న్యాయం లేకపోతే చట్టవ్యవస్థపై నమ్మకం దెబ్బతింటుందన్న ఆందోళన**
- **మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు శివారపు శ్రీధర్**

**మహబూబాబాద్, విశాలభారతి:**



దేశ రాజ్యాంగం చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానమని స్పష్టంగా పేర్కొంటున్నప్పటికీ, ప్రస్తుత సమాజంలో కనిపిస్తున్న పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయని మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు శివారపు శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజలపై తీవ్రమైన కేసులు నమోదైతే వెంటనే అరెస్టులు, నిర్బంధాలు జరుగుతున్నాయని, కొన్నిసార్లు కుటుంబ సభ్యులకు కూడా సమాచారం ఇవ్వకుండా వ్యవహరిస్తున్న ఘటనలు కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. చేయని నేరాలకు కూడా పేదలు బలవుతున్న పరిస్థితులు బాధాకరమన్నారు. అదే సమయంలో అధికారం, ధనం, రాజకీయ అండ ఉన్న కుటుంబాలకు చెందిన వారిపై ఆరోపణలు వచ్చినప్పుడు మాత్రం విచారణ పేరుతో ఆలస్యం చేయడం, ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం ప్రజల్లో అనేక అనుమానాలకు తావిస్తున్నదన్నారు. నేరం చేసిన వ్యక్తి పేదవాడా, ధనవంతుడా అనే తేడా లేకుండా చట్టం ఒకే విధంగా అమలవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమాజానికి ధర్మం, సంస్కారం, విలువల గురించి బోధనలు చేసే కొందరు పెద్దల కుటుంబ సభ్యులపై ఆరోపణలు వచ్చినప్పటికీ ఇప్పటికీ అరెస్టులు జరగకపోవడం అత్యంత విచారకరమన్నారు. కొన్ని రాష్ట్రాల్లో అత్యాచార కేసుల్లో శిక్షపడిన వారిని విడుదల సమయంలో పూలదండలతో స్వాగతించడం ప్రజాస్వామ్య విలువలకు అవమానకరమని వ్యాఖ్యానించారు. అలాంటి ఘటనలు బాధిత కుటుంబాల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తాయని తెలిపారు. పేదవాడు తప్పు చేస్తే ఒక న్యాయం, అధికారం ఉన్నవాడు తప్పు చేస్తే మరో న్యాయం అనే పరిస్థితి కొనసాగితే ప్రజల్లో చట్టవ్యవస్థపై నమ్మకం క్రమంగా దెబ్బతింటుందని శ్రీధర్ హెచ్చరించారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ప్రతి ఒక్కరికీ సమాన న్యాయం జరిగే రోజులు రావాలని కోరుకుంటూ తన ఆవేదనను వ్యక్తం చేశారు.

## చెరువులు కాల్వల మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి




**ఈ.ఈ సత్యనారాయణ**

**మోత్కూరు, విశాలభారతి:**

చెరువుల పునరుద్ధరణ కాల్వల మరమ్మతులు, నీటి వనరుల సమర్థ వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తిరుమలగిరి డివిజన్ ఇరిగేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ ఎం సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మండలంలోని పాటిమట్ల గ్రామంలోని రైతు వేదిక లో రైతు వారోత్సవం ఘనంగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రైతుల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్మని పేర్కొన్నారు. బృందావన్ కాల్వ మరమ్మతుల కోసం రూ.1.42 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని, ప్రస్తుతం ఆ ఫైల్ సచివాలయంలో ఆర్థిక శాఖ పరిశీలన ఉందని పేర్కొన్నారు. తాగునీటి సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం నుండి పరిపాలన అనుమతులు వచ్చిన వెంటనే మరమ్మతులు పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని కొండగడప చెక్ డ్యాం నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు కూడా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామన్నారు. మండల పరిధిలోని చెరువులు కుంటలు ఎక్కడైనా మరమ్మతులు అవసరమైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని రైతులను కోరారు. రైతులు ఇచ్చిన నివేదికను పరిశీలించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. రైతుల సహకారంతో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రైతు సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తహశ్రీల్దార్ పి. జ్యోతి, ఎంపీడీవో బాలాజీ, మండల ఇరిగేషన్ ఏఈ అఖిల్ ,పిఎసిఎస్ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, వివిధ గ్రామాల సర్పంచులు బండ రమ, అంతటి భగవంతు, పైళ్ల నర్సిరెడ్డి, బీసు వెంకటయ్య ప్రజా ప్రతినిధులు ,అధికారులు రైతులు పాల్గొన్నారు.

## బాటసింగారం విద్యార్థికి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో చోటు

- **జావెలిన్ త్రో విభాగంలో ప్రతిభ కనబరిచిన మందారి ధనాంజనేయులు**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్:**



రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మందారి ధనాంజనేయులు తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న ధనాంజనేయులు ఈ నెల 10వ తేదీన హనుమకొండ జిల్లాలోని జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాన అథ్లెటిక్స్ స్టేడియంలో నిర్వహించనున్న 3వ తెలంగాణ రాష్ట్రస్థాయి జంప్స్ అండ్ త్రోస్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొననున్నాడు. ఈ నెల 7న సరూర్‌నగర్ ఇండోర్ ప్రధాన అథ్లెటిక్స్ మైదానంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ధనాంజనేయులు విశేష ప్రతిభ కనబరిచి, 16 సంవత్సరాల లోపు బాలుర విభాగంలో జావెలిన్ త్రో ఈవెంట్‌కు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని దాసరి ప్రతాప్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గౌరీశంకర్ , ఉపసర్పంచ్ ప్రజా ప్రతినిధులు, మండల ఎంపీడీవో శ్రీవాణి , ఎంఈఓ జగదీష్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందిస్తూ రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో ఎమ్మెల్యే



**యాదాద్రి భువనగిరి, విశాలభారతి:** భువనగిరిలోని ప్రగతి నగర్ వార్డులో శనివారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. లబ్ధిదారులు ముదిగొండ మమత, గుంజ మానసలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి అర్హ కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తీ, మున్సిపల్ వైస్ ఛైర్పర్సన్ పోతంశెట్టి మంజులవెంకటేశ్వర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కూర వెంకటేష్, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## కుప్పకూలిన 80 ఏళ్ల రావి చెట్టు వృక్షానికి పునర్జన్మ



**విశాలభారతి, గోదావరిఖని:** పర్యావరణ పరిరక్షణలో సింగరేణి సంస్థ ఎప్పుడూ ముందుంటుందని మరోసారి నిరూపితమైంది. ఆర్జీవన్ ఏరియా పరిధిలోని జీడీకే 11 ఇంక్లైన్ గని సమీపంలో ఇటీవల కురిసిన గాలి వానకు సుమారు 80 సంవత్సరాల వయస్సు గల భారీ వృక్షం నేలకొరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఆర్జీవన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ ఆ వృక్షాన్ని కాపాడాలని నిర్ణయించారు.నేడు స్థానిక సింగరేణి సెంట్రల్ నర్సరీ సమీపంలోని జంక్షన్ రోడ్ వద్ద, ఆ నేలకొరిగిన వృక్షాన్ని శాస్త్రీయ పద్ధతిలో తరలించి, జియం స్వయంగా నాటి దానికి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. పర్యావరణాన్ని కాపాడడం మనందరి బాధ్యత అని, వృద్ధ వృక్షాలను సంరక్షించడం ద్వారా ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవచ్చని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జియం తో పాటు చిలుక శ్రీనివాస్ (ఏజెంట్, జీడీకే 11 గ్రూప్ ఆఫ్ మైన్) కర్ణ (డిజియం ఫారెస్ట్ ఆఫీసర్), రవీందర్ రెడ్డి (పర్సనల్ మేనేజర్), డిజియం సి. యస్. పి ఫైడిశ్వర్, హనుమంతరావు (సీనియర్ పిఓ), ఏ ఎయిటియుసి ప్రతినిధి జియం ఆఫీస్ రాజు తదితర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎనభై ఏళ్ల చరిత్ర కలిగిన చెట్టును కాపాడి, పునఃప్రతిష్ఠ చేసిన జియం చొరవను స్థానికులు మరియు పర్యావరణ ప్రేమికులు కొనియాడారు.

## అక్రమంగా ఎద్దులు, ఆవులను తరలిస్తున్న కంటైనర్ వ్యాన్ పట్టివేత




**విశాలభారతి, పెద్దపల్లి:** శనివారం తెల్లవారుజామున సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు ఆధ్వర్యంలో ఎస్ఐలు చంద్రకుమార్,అశోక్ రెడ్డిలు తమ సిబ్బందితో కలిసి దుబ్బపల్లి చెక్‌పోస్ట్ వద్ద వాహనతనిఖీలు నిర్వహిస్తుండగా,ఒక కంటైనర్‌లో 33 ఎద్దులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి పట్టుకున్నారు. ప్రాథమిక విచారణలో ఆ ఎద్దులను కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తేలింది.ఈ ఘటనకు సంబంధించి 33 ఎద్దులు,కంటైనర్‌ను స్వాధీనం చేసుకుని ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలానికి చెందిన అబ్దుల్ ఖాన్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ అలీపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా ఉదయం 10:30 గంటల సమయంలో ఛత్తీస్‌గఢ్ నుంచి కర్ణాటకకు ఐచర్ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 9 ఆవులను కూడా స్వాధీనం చేసుకుని, కర్ణాటకకు చెందిన సయ్యద్ షాబాద్, సయ్యద్ మొయినుద్దీన్‌లపై కేసులు నమోదు చేశారు.స్వాధీనం చేసుకున్న ఆవులు, ఎద్దులను సమీప గోశాలలకు తరలించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ఎవరైనా పశువులను అక్రమంగా లేదా పరిమితికి మించి తరలిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రామగుండం రైల్వే స్టేషన్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు



**విశాలభారతి , రామగుండం:** నేరాల నియంత్రణ, గంజాయి అక్రమ రవాణా మరియు వినియోగం, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను అరికట్టేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి ఆదేశాల మేరకు రామగుండం సీఐ కృష్ణ కుమార్ ఆధ్వర్యంలో శనివారం రామగుండం రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు నిర్వహించారు.యువత మరియు ప్రజల ఆరోగ్యానికి, ప్రాణాలకు హాని కలిగించే గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణతో పాటు వివిధ నేరాలకు పాల్పడే నిందితుల కదలికలను గుర్తించే లక్ష్యంతో రైల్వే స్టేషన్‌లో సిబ్బందితో కలిసి ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లోని సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసర ప్రాంతాలు,పార్సెల్ సర్వీస్ కేంద్రాలు, హైదరాబాద్, మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే ప్రయాణికులు ప్రయాణించే రైల్వే బోగీలు, అనుమానాస్పదంగా కనిపించే ప్రతీ పార్సిల్, రవాణా బ్యాగులు, ప్రయాణికుల సామగ్రిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇతర ప్రాంతాల నుంచి రైల్వే మార్గం ద్వారా వివిధ నేరాలకు పాల్పడే నిందితులు ప్రయాణించే అవకాశం ఉన్నందున ఆకస్మికంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు.

## బీసీలకు న్యాయం చేయాలి: ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్




**విశాలభారతి, రామగుండం:** జనగణనలో బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఓబీసీ ఎంపీల ఫోరం మాజీ కన్వీనర్, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు ఆయన అంబర్ పేట నివాసంలో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నిరవధిక నిరాహార దీక్షలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామగుండం నియోజకవర్గ శాసన సభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశంలో బీసీల జనాభాకు అనుగుణంగా హక్కులు, అవకాశాలు, రాజకీయ మరియు సామాజిక ప్రాతినిధ్యం కల్పించాలంటే కులాల వారీ జనగణన అత్యంత అవసరమని అన్నారు. బీసీల వాస్తవ జనాభా వివరాలు వెలుగులోకి వస్తేనే వారికి తగిన న్యాయం జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీల అభ్యున్నతికి, బీసీ జనాభా ప్రతిపాదికగా న్యాయం జరగాలంటే జనగణనలో బీసీ జనాభా కూడా లెక్కించాలి అని పలు మార్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి లేఖలు రాసిన కూడా సరైన స్పాందన లేకపోవడంతో ఈ దీక్ష వి.హనుమంత రావు చేస్తున్నరాని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్రమ క్రషర్ మిల్లును వెంటనే సీజ్ చేయాలి

- బ్లాస్టింగ్ భయంతో వణికిపోతున్న గ్రామాలు
- పగుళ్లు పడుతున్న ఇండ్లు
- ప్రజల ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు
- అక్రమాలకు అండగా వ్యవస్థ?
- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి
- రాత్రివేళల్లో భారీ బ్లాస్టింగ్‌లతో భయాందోళనలో ప్రజలు
- పగుళ్లు పడుతున్న ఇండ్లు – పట్టించుకోని అధికారులు.





**కురవి, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా సిరోలు మండలం చింతపల్లి గ్రామ శివారులో దశాబ్దాలుగా కొనసాగుతున్న అక్రమ క్రషర్ మిల్లు కార్యకలాపాలు స్థానిక ప్రజల జీవితాలను నరకప్రాయంగా మార్చాయని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ అక్రమ క్రషర్ మిల్లును వెంటనే సీజ్ చేసి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. శనివారం బాధిత గ్రామాల ప్రజలతో కలిసి ఆయన క్రషర్ ప్రాంతాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న బ్లాస్టింగ్ ప్రభావాన్ని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా గమనించారు. గ్రామస్తులు తమ ఇండ్లకు ఏర్పడిన పగుళ్లు, గోడల విరుగుడు, బావుల నష్టాలను చూపిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్రషర్ నిర్వాహకులు అధికారుల నుంచి కేవలం రెండు ఎకరాల మేరకు మాత్రమే అనుమతులు పొందినా, నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ పెద్ద ఎత్తున అక్రమ బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా రాత్రివేళల్లో భారీ పేలుళ్లు జరుపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. చింతపల్లి, కొత్తూరు, సి. కందికొండ స్టేజీ తదితర గ్రామాల్లో ప్రజలు ప్రతి రాత్రి భయంతో గడుపుతున్నారని చెప్పారు.

**బ్లాస్టింగ్ ధాటికి కంపిస్తున్న ఇండ్లు**

క్రషర్ మిల్లులో జరుగుతున్న పేలుళ్ల ప్రభావంతో గ్రామాల్లోని ఇండ్లు కంపిస్తున్నాయని, అనేక గృహాలకు పగుళ్లు ఏర్పడ్డాయని నల్లు సుధాకర్ రెడ్డి తెలిపారు. స్లాబ్‌లు విరిగిపోవడం, గోడలు చిట్లిపోవడం, ఇంటి సామగ్రి కిందపడిపోవడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారని పేర్కొన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, రాత్రివేళల్లో నిద్రపట్టని పరిస్థితి నెలకొందన్నారు. "ఒక భారీ పేలుడు వినిపించిన ప్రతిసారీ ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటకు పరుగులు తీస్తున్నారు. గ్రామాల్లో భయానక వాతావరణం నెలకొంది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు తీవ్ర ఆందోళనలో జీవిస్తున్నారని, పిల్లలు చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నారని తెలిపారు.

**రైతులకు తీవ్ర నష్టం**

క్రషర్ మిల్లు కారణంగా రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆరోపించారు. బ్లాస్టింగ్ ప్రభావంతో పంట పొలాలు దెబ్బతింటున్నాయని, బావుల్లో నీటి మట్టం తగ్గిపోతుందని, పశువులు భయంతో అస్వస్థతకు గురవుతున్నాయని తెలిపారు. రాళ్ల దుమ్ము కారణంగా పంటలు నాశనమవుతున్నాయని, వ్యవసాయం పూర్తిగా దెబ్బతింటోందని రైతులు వాపోయారని పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య కూడా తీవ్రరూపం దాల్చుతోందని, బ్లాస్టింగ్‌ల కారణంగా భూగర్భ జలాలు ప్రభావితమవుతున్నాయని అన్నారు. ప్రజల ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడుతోందని, శ్వాసకోశ సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని ఆరోపించారు.

**అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు?**

అక్రమ బ్లాస్టింగ్‌పై ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా సంబంధిత శాఖ అధికారులు స్పందించకపోవడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని నల్లు సుధాకర్ రెడ్డి మండిపడ్డారు. "ప్రజల ప్రాణాల కంటే అక్రమ వ్యాపారుల లాభాలకే అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారా?" అని ప్రశ్నించారు. పర్యావరణ నిబంధనలు, మైనింగ్ చట్టాలు, భద్రతా ప్రమాణాలు అన్నింటినీ తుంగలో తొక్కుతూ నిర్వాహకులు వ్యవహరిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. "ఇంకా ఎంతమంది ప్రాణాలు పోతే అధికారులు మేల్కొంటారు? ఎంతటి ప్రమాదం జరిగితే చర్యలు తీసుకుంటారు?" అని ప్రశ్నించారు.

**వెంటనే సీజ్ చేయాలి – లేదంటే ఉద్యమాలు తప్పవు.**



అక్రమంగా కొనసాగుతున్న ఈ క్రషర్ మిల్లును వెంటనే సీజ్ చేసి నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని, పగుళ్లు పడిన ఇండ్లను ప్రభుత్వం గుర్తించి మరమ్మతులు చేయించాలని కోరారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే గ్రామస్తులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు, కలెక్టరేట్ ముట్టడిలు నిర్వహిస్తామని హెచ్చరించారు. "ప్రజల ప్రాణాల కోసం అవసరమైతే ఎంతదూరమైనా పోరాటం చేస్తాం. అక్రమాలకు అడ్డుకట్ట వేసే వరకు వెనక్కి తగ్గేది లేదు" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామస్తులు, రైతులు, మహిళలు, యువకులు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరిధాన్యం దిగుమతులు వేగవంతం చేయాలి



**యాదాద్రి భువనగిరి, విశాలభారతి:** వరిధాన్య కొనుగోళ్లు ముమ్మరం అవుతున్న నేపథ్యంలో రైస్ మిల్లర్లు వెంటనే ధాన్యం దిగుమతులు చేపట్టాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి ఆదేశించారు. జిల్లా కేంద్రంలో శనివారం మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మిల్లర్లు సరిపడా హమాలీలను పెంచుకుని, షిఫ్ట్‌ల వారీగా దిగుమతులు నిరంతరంగా జరిగేలా చూడాలని సూచించారు. అలాగే మిల్లర్ల అక్నలెడ్జ్మెంట్ ప్రక్రియను పూర్తిచేయాలని తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు పీపీసీ కేంద్రాల్లో అదనపు లారీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీఎస్ఓ, డీఎంసీఎస్, ఆర్టీఓ, డీటీసీఎస్ పాల్గొన్నారు.

# అక్రమ గుడుంబా వారిపై పోలీసుల దాడి



**దేవరుప్పుల విశాలభారతి:** మండలం పరిధిలోని అక్రమంగా నిలువ ఉంచిన ఐదు లీటర్ల గుడుంబా మరియు మూడు కిలోల పట్టికను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు దేవరుప్పుల ఎస్ఐ ఊర కుమార్ తెలిపారు. అక్రమ మద్యం తయారీ విక్రయాలు మరియు రవాణా వంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి అక్రమ కార్యక్రమాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.

# ఎస్ఐ సదానందంకి ఘన వీడ్కోలు




**దేవరుప్పుల విశాలభారతి:** దేవరుప్పుల మండలంలో విధులు నిర్వహించి ప్రమోషన్ పై బదిలీ అవుతున్న ఎస్సై సదానందంకి వర్ధన్నపేట ఏసీపి ఏ నర్సయ్య పాలకుర్తి సీఐ జానకిరాంరెడ్డి, దేవరప్పుల ఎస్ఐ సృజన్ కుమార్ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి ఆయన సేవలను కొనియాడుతూ, అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, ప్రజలతో స్నేహపూర్వక వ్యవహారం, పోలీస్ శాఖకు చేసిన సేవలు మరువలేనివని అధికారులు పేర్కొన్నారు. ప్రమోషన్ పై కొత్త బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ సదానందం గారికి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# స్వీయ గణనపై అవగాహన కల్పిస్తూ మారథాన్ రన్

**రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు ప్రజల్లో చైతన్యం**



**మహబూబాబాద్, విశాలభారతి:** ప్రభుత్వ సూచనలు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు జనాభా గణన కార్యక్రమంలో భాగంగా శనివారం మహబూబాబాద్ పట్టణంలో స్వీయ గణన మారథాన్ రన్ నిర్వహించారు. రైల్వే స్టేషన్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు సాగిన ఈ అవగాహన ర్యాలీకి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్, అదనపు జనగణన అధికారి అనిల్ కుమార్ జెండా ఊపి మారథాన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా స్వీయ గణన వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. జనాభా గణన దేశ అభివృద్ధికి కీలకమని, సరైన సమాచారం అందించడం ద్వారా ప్రభుత్వ పథకాల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతుందన్నారు. ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు స్వీయ గణన కార్యక్రమం కొనసాగుతుందని, ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు ఇందులో పాల్గొంటున్నారని తెలిపారు. అలాగే మే 11 నుంచి జూన్ 9 వరకు ఇంటింటి గణన కార్యక్రమం నిర్వహించబడుతుందని, జనగణన సిబ్బంది ఇండ్లను సందర్శించి వివరాలు సేకరిస్తారని చెప్పారు. ప్రజలు పూర్తి సహకారం అందించి తమ వివరాలను ఖచ్చితంగా నమోదు చేయించాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, డిపిఓ హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వరరావు, సెన్సెస్ సిబ్బంది వినయ్, ఉద్యోగులు అశోక్, రాము, వెంకటేశ్వర్లు, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు, స్వయం సహాయక బృందాల సభ్యులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

# వేసవిలో విద్యార్థులకు ప్రత్యేక నైపుణ్య శిక్షణా శిబిరాలు

**మరిపెడలో మే 11 నుంచి వేసవి శిక్షణా శిబిరాలు**



**డోర్నకల్, విశాలభారతి:** విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 11వ తేదీ నుంచి 25వ తేదీ వరకు వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించనుంది. మరిపెడ మండలంలో పీఎం శ్రీ జడ్పీహెచ్‌ఎస్ సీతారాంపురం, పీఎం శ్రీ మోడల్ స్కూల్ మరిపెడ మరియు కేజీబీవీ మరిపెడలో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి గాదె అనితాదేవి తెలిపారు.5వ తరగతి నుంచి 10వ తరగతి చదువబోయే విద్యార్థులందరూ ఈ శిబిరాల్లో పాల్గొనవచ్చని ఆమె తెలిపారు. సంగీతం, యోగా, చిత్రలేఖనం, కంప్యూటర్ శిక్షణ, మాట్లాడే ఆంగ్లం, వేగవంతమైన గణితం, ఇండోర్ ఆటలు, వ్యక్తిత్వ వికాసం, జానపద మరియు శాస్త్రీయ నృత్యం వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ అందించనున్నారు.పీఎం శ్రీ పాఠశాలల్లో ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. పాల్గొనే విద్యార్థులకు అల్పాహారం, అవసరమైన శిక్షణా సామగ్రిని ఉచితంగా అందజేస్తారు. కేజీబీవీ మరిపెడలో బాలికలకు వసతి సౌకర్యంతో కూడిన ప్రత్యేక శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నారు.

# వాహన తనిఖీలు నిర్వహించిన గోదావరిఖని వన్ టౌన్ పోలీసులు

**రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనదారులకు అవగాహన**



**విశాలభారతి, గోదావరిఖని:** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 5 ఇంక్లైన్, రమేష్‌నగర్ తదితర ప్రాంతాల్లో గోదావరిఖని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి,ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రతా నిబంధనలు,రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి వాహనదారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్,ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ వంటి వాహన సంబంధిత పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ ధరించడం ద్వారా ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం తగ్గించుకోవచ్చని వివరించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్ చేయడం,సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం,మైనర్ల చేత వాహనాలు నడిపించడం వంటి ప్రమాదకర చర్యలు చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని,ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

# కాల్వ గట్లపై కబ్జాకోరుల పంజా..!



- కుర్చీలకు అతుక్కుపోయిన అధికారులు
- కాల్వ గట్లను కబ్జా చేస్తున్న అక్రమార్కులు!
- కాసులకు కక్కుర్తి పడి అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారనే విమర్శలు

**మహబూబాబాద్, విశాలభారతి:** ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు.., కబ్జాకోరుల కన్నుపడుతోంది.పచ్చని పొలాలకు ప్రాణాధారమైన సాగునీటి కాల్వలు ఇప్పుడు అక్రమార్కుల వేటలో చిక్కుకున్నాయి. మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా ఎస్సారెస్పీ (ఎస్.ఆర్ మ.ఎస్.పి) కెనాల్ కాల్వల ఇరువైపులా ఉన్న భూమి యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతుండటం ఆందోళన కలిగించే అంశం. వ్యవస్థను శాసించాల్సిన అధికార గణం చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక ఉన్న మతలబు ఏమిటనే ప్రశ్నలు సామాన్య ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ఎస్సారెస్పీ కాల్వల గట్లు క్రమంగా కనుమరుగవుతున్నాయి. కొందరు కాల్వ స్థలాల్లో ఏకంగా శాశ్వత భవనాలు నిర్మిస్తుంటే, మరికొందరు తమ వ్యవసాయ భూములకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి సాగు భూమిలో కలిపేసుకుంటున్నారు. కాల్వల నిర్వహణ, మరమ్మతులు చేపట్టాల్సి వచ్చినప్పుడు యంత్రాలు, వాహనాలు వెళ్లడానికి కనీసం దారి కూడా లేకుండా గట్లను చెరిపేస్తున్నారు. రేపు కాల్వకు గండి పడినా, పూడిక తీయాలన్నా యంత్రాలు వెళ్లలేని పరిస్థితిని కబ్జాదారులు కల్పిస్తున్నారు. ఇది భవిష్యత్తులో సాగునీటి సరఫరాకు పెద్ద విఘాతంగా మారనుంది. ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ, ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన కొందరు అధికారులు కాసులకు కక్కుర్తి పడి అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలిసినా, కార్యాలయాల్లోని కుర్చీలకే అతుక్కుపోవడం వెనుక ఉన్న 'అంతర్యం' ఏంటో జిల్లా యంత్రాంగం కనిపెట్టాలి. జిల్లా కలెక్టర్ గారు ఇటీవలే సమీక్షా సమావేశంలో ప్రభుత్వ భూములు, కాల్వలు ఆక్రమణకు గురికాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినా, ఆ ఆదేశాలు క్షేత్రస్థాయి అధికారుల చెవికి ఎక్కడం లేదు. కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేయడం అంటే వ్యవస్థను ధిక్కరించడమే. ఆక్రమణల పర్వం ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో సాగునీటి వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలి. తక్షణమే కాల్వల వెంబడి సర్వే నిర్వహించి, ఆక్రమణలను నిర్దాక్షిణ్యంగా తొలగించాలి. విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ, అక్రమార్కులకు సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రభుత్వ ఆస్తులకు రక్షణ, రైతులకు భరోసా లభిస్తుంది.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

- రైతు ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియపై దృష్టి సారించాలి
- విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలి



**మహబూబాబాద్, విశాలభారతి:** ధాన్యం కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, సెన్సస్, విద్యా వారోత్సవాలపై శనివారం హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ అన్ని జిల్లాలలో వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు.సెల్ఫ్ ఎన్యూమరేషన్ కు ఒక్క రోజే మిగిలి ఉండడంతో ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.రాష్ట్రంలో పది లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, వీరంతా స్వీయ గణన చేసుకోవాలని ఆదేశించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 11వ తేదీ నుంచి నిర్వహించే విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సిఎస్ కోరారు.కలెక్టరేట్ మొదటి అంతస్తు వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్,వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సూచనలు ఆదేశాల మేరకు సంబంధిత అంశాలపై పకడ్బందీగా ముందుకెళ్తామన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యా వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. సెన్సెస్ పై సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లకు గూగుల్ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, వ్యవసాయ శాఖ అధికారిని సరిత, విద్యాశాఖ అధికారి సత్యనారాయణ మూర్తి,ఇంటర్మీడియట్ అధికారి మదర్, ఈ ఈ అరుణ్ కుమార్, మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ సాయి చరణ్, మార్కెటింగ్ అధికారి వెంకటేశ్వర్లు, సిపిఓ శ్రీనివాసరావు, డి.ఎస్ఓ రమేష్, డి ఎం సప్లై సివిల్ సప్లై నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# హమాలీ రెట్లు పెంచాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

**డిమాండ్లు నెరవేర్చకపోతే సమ్మెలకు వెళ్తామని హెచ్చరిక**




**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం ఫ్రూట్ మార్కెట్‌లో హమాలీ కార్మికుల రెట్లు పెంచాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. హమాలీ కార్మికులతో కలిసి చేపట్టిన ఈ నిరసనలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల నర్సింహ పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ కార్మికుల కూలి రేట్లు పెంచాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కార్మికులు కష్టపడి పనిచేస్తున్నప్పటికీ వారికి సరైన పారితోషికం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీ రెట్లు పెంపుపై సంబంధిత అధికారులు, యాజమాన్యం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను 14 రోజుల్లో పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, అనంతరం సమ్మెల బాట పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాలరాజు, గుండె శివకుమార్, మసూద్, షరీఫ్, కృష్ణ, షబ్బీ, రాములు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ హైకోర్టు తీర్పు ప్రభావం

**చైర్మన్‌గా రాందాస్ ముదిరాజ్ కొనసాగింపు**



**రాజేంద్రనగర్, విశాలభారతి : హైదర్ షాకోట్:** సహకార సంఘాల చైర్మన్ పదవీకాలాన్ని కొనసాగించాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో హైదర్ షాకోట్ సహకార సంఘం చైర్మన్‌గా రాందాస్ ముదిరాజ్ కొనసాగనున్నారు. ఈ మేరకు ఆయన పదవి స్వీకరణ పత్రాన్ని కలెక్టర్ నుండి పొందిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మాట్లాడిన రాందాస్ ముదిరాజ్ హైకోర్టు తీర్పుపట్ల హర్షం వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తానని, సంఘ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, డైరెక్టర్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చిల్కూరులో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**మొయినాబాద్, విశాలభారతి:** ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో చిల్కూరు గ్రామంలోని డబుల్ బెడ్‌రూమ్ హౌసింగ్ క్వార్టర్స్‌లో శుక్రవారం ఉదయం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు జరిగిన ఈ ఆపరేషన్‌ను ఏసీపీ బి. కిషన్ పర్యవేక్షణలో, మొయినాబాద్ ఎస్‌హెచ్‌ఓ వై. మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. చెవెళ్ల జోన్ పోలీసు సిబ్బంది కూడా ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ప్రాంతంలో అనుమానాస్పద వ్యక్తులు, అద్దెదారులు, వాహనాలను తనిఖీ చేయడం, సంఘ వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యంగా ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.తనిఖీల్లో భాగంగా 43 ద్విచక్ర వాహనాలు, 10 నాలుగు చక్రాల వాహనాలు, 7 మూడు చక్రాల వాహనాలను పరిశీలించారు. వీటిలో 21 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలకు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, నంబర్ ప్లేట్లు వంటి సరైన పత్రాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలను పాపిలాన్ పరికరం ద్వారా సేకరించి, తెలంగాణ పోలీసుల టీఎస్‌కాప్ యాప్ ద్వారా వారి నేర చరిత్రను పరిశీలించారు. పోలీసులు సరైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఈ ఆపరేషన్‌ను ప్రశాంతంగా నిర్వహించగా, నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో ఇది కీలకంగా ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.



# వైభవంగా శ్రీ హేమాద్రి వేంకటేశ్వర స్వామి ప్రాణప్రతిష్ట

**విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న రాజకీయ ప్రముకులు**



**కీసర,విశాల భారతి :**

కీసర మండలం రాంపల్లి దాయరలోని 'వెంకులోని గుట్ట' పై నూతనంగా నిర్మించిన హేమాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాణప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం శ్రీవారి కళ్యాణంతో అత్యంత వైభవంగా ముగిశాయి.ఈ నెల 6వ తేదీ బుధవారం ప్రారంభమైన ఈ వేడుకలు నాలుగు రోజుల పాటు ఆధ్యాత్మిక శోభతో కొనసాగాయి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరఫున ఆయన ముఖ్య సలహాదారు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శాస్త్రోక్తంగా యంత్ర, విగ్రహ స్థాపన:**

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ ) ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు పర్యవేక్షణలో శ్రీవారి యంత్ర, విగ్రహ, శిఖర స్థాపన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనము, అగ్ని ఆరాధన, కుంభారాధన, మహా పూర్ణాహుతి మరియు మహా కుంభ సంప్రోక్షణ వంటి వైదిక క్రతువులను అర్చక బృందం నిర్వహించింది. అనంతరం గో దర్శనము, కన్యా దర్శనము, బ్రహ్మఘోషతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణంలో పాలుపంచుకున్న స్థపతులను (శిల్పులను), ఈ మహోత్సవ వేడుకలో పాల్గొన్న సేవకులను ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది.

**నాట్య ప్రదర్శనలతో అలరించిన చిన్నారులు:**

ప్రాణప్రతిష్ట వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా చిన్నారి నాట్యకళాకారిణులు తమ అద్భుతమైన నాట్య ప్రదర్శనలతో భక్తులను మంత్రముగ్ధులను చేశారు. స్వామివారి కీర్తనలకు అనుగుణంగా వారు చేసిన నృత్యాలు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**తరలివచ్చిన ప్రముఖులు:**

ఈ ఆధ్యాత్మిక వేడుకకు వివిధ రంగాల ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ రెడ్డి, హిందూ ధర్మ ప్రచారకులు స్వామి రాధా మనోహర్ దాస్, సాయి దత్త పీఠాధిపతులు శ్రీ రామానంద ప్రభుజీ స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంత్ రావు, మలిపెద్ది సుధీర్ రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్,అశోక్, మరియు కందాడి అంజిరెడ్డి తదితరులు శ్రీవారిని సేవించుకున్నారు.ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి అతిథులను సత్కరించి శ్రీవారి చిత్రపటాలను అందజేశారు.

## మొక్కజొన్నను సత్వరమే రవాణా చర్యలు చేపట్టాలి

**మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కొత్వాల**



**పాల్వంచ విశాలభారతి:** రైతులు అకాల వర్షాలతో ఇబ్బంది పడకుండా మార్క్ఫెడ్ అధికారులు మొక్కజొన్న కేంద్రాల నుండి త్వరతగతిన గోడౌన్ లకు పంపేలా రవాణా చర్యలు చేపట్టాలని పాల్వంచ సొసైటీ చైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, DCMS మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.పాల్వంచ మండలం పరిధిలోని ఉల్వనూరులో పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. శనివారం కేంద్రాన్ని కొత్వాల సందర్శించారు. మొక్కజొన్న రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ అకాల వర్షాలతో కేంద్రాల్లోని మొక్కజొన్న కుప్పలు తడుస్తున్నాయనీ, దాని వలన మొక్కజొన్న గింజలు ఫంగస్ చేరి, నల్లబడుతున్నాయన్నారు. దాని వలన మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం వుందన్నారు. మార్క్ఫెడ్ అధికారులు లారీల యాజమాన్యంతో మాట్లాడి మొక్కజొన్నలను సూచించిన గోడౌన్ వద్దకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని కొత్వాల మార్క్ఫెడ్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఇంచార్జి మోహన్ రెడ్డి, మాజీ ZPTC సభ్యులు బరిపటి వాసుదేవరావు, యర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న గౌడ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## మిత్రపక్షాల ఐక్యతను దెబ్బతీసే కుట్రను వెనక్కు తీసుకోవాలి

- కేంద్ర ప్రభుత్వం అధికారాన్ని ఖూనీ చేస్తుంది
- జిల్లా గ్రంధాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు నిరసన వ్యక్తం



**కొత్తగూడెం :విశాలభారతి:** కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం ముందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంధాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలో ప్రజలు ఇచ్చిన తీర్పును గవర్నర్ తూట్లు పొడుస్తున్నారని అన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అయితే విజయ్ కి మద్దతు ఇచ్చిందో అప్పుడు జీర్ణించుకోలేని కేంద్ర మంత్రి అమిత్ షా, గవర్నర్ ని ప్రభావితం చేసి విజయ్ ని సీఎం కాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కేంద్ర ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఖూనీ చేస్తుందని అన్నారు. అలాగే బడుగు బలహీన వర్గాల నుంచి వచ్చిన విజయ్ గారు ఇవాళ కాంగ్రెస్ పార్టీ అండగా ఉందని దీనికి వామపక్ష పార్టీలు కూడా మద్దతు తెలపడం నిజంగా సంతోషమని అన్నారు. మిత్రపక్షల ఐక్యతను దెబ్బతీసేందుకు గవర్నర్ చేస్తున్న కుట్రను వెంటనే వెనక్కు తీసుకోవాలని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని అంబేద్కర్ రాసించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ యువతపై ఉందని తెలియజేశారు

## వివాహ వేడుకలలో పాల్గొన్న సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్



**విశాలభారతి , కరకగూడెం:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కరకగూడెం మండలం, వెంకటాపురం గ్రామానికి చెందిన *పోలేబోయిన జగన్‌పాపమ్మ (మాజీ సర్పంచ్) దంపతుల కుమార్తె నాగశ్రీనవీన్ ల వివాహ వేడుకలో పాల్గొని అలాగే సమత్ బట్టుపల్లి గ్రామానికి చెందిన *చందా వసంతరావువసంత కుమారి దంపతుల కుమార్తె సుధాఅరుణ్ కుమార్ ప్రధాన వేడుకలో పాల్గొని నూతన వధూ వరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ కరకగూడెం మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్. ఈ కార్యక్రమంలో మండల నాయకులు,కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఎగ్జామ్స్ ఫీజు గడువు పెంపు




**పాల్వంచ విశాల భారతి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లెర్నింగ్ సెంటర్ పరిధిలో జూన్ నెల 14వ తేదీ నుండి నిర్వహించనున్న సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లింపులకు ఈ నెల 19వ తేదీ వరకు గడువు ఉన్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ మరియు కోఆర్డినేటర్ పారెల్లి శ్రీనివాస్ సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాలకు సంబంధించిన రెండు, నాలుగు మరియు ఆరు సెమిస్టర్ విద్యార్థులు ఆన్లైన్ ద్వారా ఫీజులు చెల్లించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే ఫీజు చెల్లించి తమ నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.విద్యార్థులు మరిన్ని వివరాలకు కళాశాల లెర్నింగ్ సెంటర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

## మహిళా సాధికారతకు కాంగ్రెస్ సర్కార్ భరోసా



**రుణ పరిమితి రూ.10 లక్షలకు పెంపుతో గ్రామీణ మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ : ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్:**

మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల పరిమితిని రూ.10 లక్షలకు పెంచిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పై ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాల క్రితం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మహిళా సాధికారత కోసం వేసిన బీజం నేడు తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే మహావృక్షంగా రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు.నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలకు చెందిన ఐకేపీ ఏపీఎంలు, సీసీలు, మహిళా సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి ప్రభుత్వ నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. మహిళా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. గతంలో రూ.5 లక్షల రుణ పరిమితితో చిన్నపాటి పొదుపులు, వ్యాపారాలకే పరిమితమయ్యేవారమని, ఇప్పుడు రూ.10 లక్షలకు పెంపుతో మహిళలు ఆర్థికంగా మరింత బలపడే అవకాశాలు ఏర్పడ్డాయని తెలిపారు. గ్రామీణ మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో ముందుకు రావడానికి ఈ నిర్ణయం ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ మహిళల జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో ఆనాడు ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన డ్వాక్రా వ్యవస్థను మాజీ ప్రధాని పీవీ నరసింహారావు బలోపేతం చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో మహిళా సాధికారతకు కొత్త చరిత్ర సృష్టిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ నిర్ణయం కేవలం అంకెల గారడీ కాదని, మహిళల ఆత్మగౌరవం, ఆర్థిక స్వేచ్ఛకు నిజమైన హామీ అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని "రైజింగ్ తెలంగాణ" నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## జర్నలిజం గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తే సహించేది లేదు

- జర్నలిస్టు సహదేవ్‌కు వెంటనే క్షమాపణ చెప్పాలి
- తెలంగాణ స్టేట్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు గౌడ్ డిమాండ్



**మహబూబాబాద్, విశాలభారతి:**

జర్నలిస్టు బేతమల్ల సహదేవ్‌పై వ్యక్తిగత దూషణలు చేయడాన్ని వార్తలు రాసినందుకు జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో దూషణలకు దిగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. మే 5న కురవి భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో బీజేపీ ఎంపీ రఘునందన్ రావుతో కలిసి కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ వీరన్న ప్రత్యేక పూజల్లో పాల్గొనడం రాజకీయంగా చర్చనీయాంశమైంది . ఈ నేపథ్యంలో ప్రజల్లో వ్యక్తమైన అనుమానాలు, రాజకీయ విశ్లేషణలను ఆధారంగా చేసుకొని "ఒక పత్రిక"లో కథనం ప్రచురించడం జరిగింది. ఆ వార్తను వక్రీకరించి జర్నలిస్టు సహదేవ్ పై డబ్బులు డిమాండ్ చేశారంటు సోషల్ మీడియాలో ఆరోపణలు చేయడం అనైతికమని జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వార్త రాసినందుకు జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకోవడం, వ్యక్తిగతంగా దూషించడం సరైన పద్ధతి కాదన్నారు. అధికార అహంకారంతో మీడియా గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు నిజాలు తెలియజేయడం జర్నలిస్టుల బాధ్యత అని, వార్తలపై స్పందించాల్సింది పోయి వ్యక్తిగత ఆరోపణలు చేయడం అనైతికమని పేర్కొన్నారు. అధికారం ఉందని ఇష్టానుసారం ప్రవర్తించడం, మీడియాపై ఒత్తిళ్లు తీసుకురావడం సరైన పద్ధతి కాదన్నారు. జర్నలిస్టుల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను సమాజం సహించదని ఇతర జర్నలిస్ట్ సభ్యులు హెచ్చరించారు. ఈ వ్యవహారంలో డాక్టర్ వీరన్న వెంటనే జర్నలిస్టు బేతమల్ల సహదేవ్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని, అలాగే జర్నలిస్టు సమాజానికి కూడా క్షమాపణలు తెలపాలని జిల్లా ప్రెస్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్థంభమని, దాని స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎందుకు ప్రతి జర్నలిస్ట్, ప్రెసెంట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఆయనకు సపోర్ట్ గా ఉంటామని శనివారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు.

## బీఎన్‌కు ఘన నివాళి

- సూర్యాపేట జిల్లాకు ఆయన పేరు పెట్టాలి - ఎంసీపీఐ(యూ)
- ట్యాంక్‌బండ్‌పై విగ్రహం ఏర్పాటు చేయాలి

**మియాపూర్,విశాలభారతి:**

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ, అమరజీవి భీమిరెడ్డి నరసింహారెడ్డి (బీఎన్) 18వ వర్ధంతి సందర్భంగా ఎంసీపీఐ(యూ) నాయకులు శుక్రవారం మియాపూర్‌లో ఘనంగా నివాళులర్పించారు. ముజఫర్ అహ్మద్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో బీఎన్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి తుడుం అనిల్ కుమార్ మాట్లాడుతూ నిజాం రజాకార్ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాన్ని నడిపిన వీరుడు బీఎన్ అని కొనియాడారు. 'బాంచన్ నీ కాల్మొక్త' అన్న పేదలకు భూములు పంచి బానిసత్వాన్ని బద్దలు కొట్టారన్నారు. ఆ పోరాటం ద్వారా పది లక్షల ఎకరాల సాగు భూమి పేదల పరమైందని, మూడు వేల గ్రామాల్లో స్వరాజ్య పాలన వచ్చిందని గుర్తుచేశారు.'తెలంగాణ చేగువేరా'గా పేరొందిన బీఎన్ పేరును సూర్యాపేట జిల్లాకు పెట్టాలని, హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహం ఏర్పాటు చేయాలని, పాఠ్యాంశాల్లో ఆయన జీవిత చరిత్ర చేర్చాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో 25 ఎకరాల్లో వీర తెలంగాణ సాయుధ పోరాట స్మృతి వనం ఏర్పాటు చేయాలని కోరారు. బీఎన్ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు సార్లు ఎమ్మెల్యేగా, మూడు సార్లు ఎంపీగా ప్రజాసేవ చేశారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాండ్ర కళావతి, అంగడి పుష్ప, ఇస్లావత్ దశరథ్ నాయక్, పల్లె మురళి, జి శివాని, ఎం.డి. రజియా బేగం, టి. పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



## సికింద్రాబాద్ సభకు భారీగా తరలివెళ్లనున్న బీజేపీ శ్రేణులు

**బీజేపీ మొయినాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు మాదాపురం శ్రీకాంత్**



**మొయినాబాద్, విశాలభారతి:** దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం సాయంత్రం 5.30 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు మొయినాబాద్ మున్సిపల్ పరిధి నుంచి భారీ సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లనున్నట్లు బీజేపీ మొయినాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు మాదాపురం శ్రీకాంత్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వరాల జల్లు కురిపిస్తోందన్నారు. రూ.7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపనలు చేయనున్నారని తెలిపారు. అదేవిధంగా రూ.3,175 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ, రూ.1,243 కోట్లతో జాతీయ రహదారి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు జరగనున్నాయని పేర్కొన్నారు.వరంగల్ టెక్స్టైల్ పార్క్ అభివృద్ధికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ తెలంగాణ ప్రగతికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో సభకు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ప్రధాని సభకు ప్రచారం

**మియాపూర్‌లో ఆహ్వాన పత్రికల పంపిణీ .. పరేడ్ గ్రౌండ్ సభను విజయవంతం చేయాలి: బీజేపీ**



**మియాపూర్,విశాల భారతి:** ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా మే 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న బీజేపీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం మియాపూర్‌లో విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వాణిజ్య వ్యాపారులు, వైద్యులు, మార్వాడీ సమాజం, స్ట్రీట్ వ్యాపారులు, ప్రజలకు సభ ఆహ్వాన పత్రికలు, వీవీఐపీ ఇన్విటేషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీశైలం కురుమ, హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి జగన్ గౌడ్, నాయకులు రామారావు, బీజేవైఎం నాయకులు వెంకట్, మహేష్ యాదవ్, రాజు సింగ్, రాకేష్, నవీన్, హరీష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కుల గణనతోనే బీసీలకు న్యాయం

**దీక్షలో టీపీసీసీ నేత జగదీశ్వర్ గౌడ్ .. వీహెచ్ ఆధ్వర్యంలో అంబర్‌పేట్‌లో నిరాహార దీక్ష**




**శేరిలింగంపల్లి విశాల భారతి:** బీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలంటే కులాల వారీగా గణన అత్యవసరమని, దీని ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు సరైన వారికి చేరతాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ అన్నారు. జనగణనలో కులాల వారీ గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు ఆధ్వర్యంలో శుక్రవారం అంబర్‌పేట్‌లో చేపట్టిన నిరాహార దీక్షకు ఆయన సంపూర్ణ మద్దతు తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులతో కలిసి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను ఖచ్చితంగా అంచనా వేయడానికి కుల గణన అవసరమని స్పష్టం చేశారు. బీసీ వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఈ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కుల గణనపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని, బీసీలకు విద్య, ఉద్యోగాల్లో తగిన అవకాశాలు కల్పించాలని, సామాజిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని నేతలు డిమాండ్ చేశారు. ఈ దీక్ష బీసీల హక్కుల సాధనలో కీలక దశ అని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నేతలు, కంటెస్టెడ్ కార్పొరేటర్లు, డివిజన్, బ్లాక్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

## ఘనంగా హేమాద్రి వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాణ ప్రతిష్ట

**ముఖ్య అతిథులుగా ఎంపి వేం నరేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** కీసర మండల పరిధిలోని రాంపల్లి దయార గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ హేమాద్రి వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు కందాడి అంజిరెడ్డి ఆహ్వానం మేరకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎంపీ వేం నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర జంగయ్య యాదవ్, ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి సహకరించిన వారిని అభినందించిన నాయకులు, గ్రామ ప్రజలు ఐకమత్యంతో ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## త్రివేణి స్కూల్స్‌లో ఘనంగా 'జీరో షాడో డే' వేడుకలు

- ఖగోళ వింతను ఆసక్తిగా తిలకించిన విద్యార్థులు
- ఫొటో, వీడియో పోటీల్లో సత్తా చాటిన చిన్నారులు

**శేరిలింగంపల్లి విశాలభారతి:** అరుదైన ఖగోళ దృగ్విషయం 'జీరో షాడో డే'ను త్రివేణి విద్యాసంస్థల విద్యార్థులు శనివారం అత్యంత ఉత్సాహంగా జరుపుకున్నారు. సూర్యుడు సరిగ్గా నడినెత్తి మీదకు రావడంతో నీడ మాయమయ్యే ఈ అద్భుతాన్ని విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించి సైన్స్‌పై అవగాహన పెంచుకున్నారు. ఈ సందర్భంగా యాజమాన్యం నిర్వహించిన ప్రత్యేక పోటీల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. 'జీరో షాడో డే' దృశ్యాలను ఫొటోలు, వీడియోల రూపంలో చిత్రీకరించి తమ ప్రతిభను చాటారు. పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు, విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లతో పాటు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, సీఆర్వో సాయి నరసింహారావు, ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసన్న, హాస్టల్ ప్రిన్సిపాల్ జగదీశ్వర్ రావు, నాగరాజు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేశారు.

## శిల్పారామంలో పేరిణి సందడి

- 110 మంది కళాకారులతో నటరాజ నృత్యాంజలి



**మాదాపూర్,విశాలభారతి:** శిల్పారామం మాదాపూర్‌లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం 'నటరాజ నృత్యాంజలి' కార్యక్రమం కనువిందు చేసింది. చంద్ర కళా నిలయం గురువు శ్రీ సంతోష్ పెరుమాండ్ల శిష్య బృందం పేరిణి, ఆంధ్రనాట్యం నృత్యాలతో ప్రేక్షకులను అలరించింది.కుంభ హారతి, పుష్పాంజలి, వినాయక గద్య, పేరిణి పాత్ర ప్రవేశం, గణపతి దేవా కైవారం, శివ కైవారం, సాహిత్య పల్లవి, అలరిపు, పలికే బంగారమాయెన, అదిగో అల్లదిగో, ముద్దుగారే యశోద, దశరథ రామ గోవిందా, నమో నమో నటరాజ, ముత్యాల హారతులు వంటి అంశాలను కళాకారులు ప్రదర్శించారు. ఆలేరు, జనగాం, స్టేషన్ ఘన్‌పూర్ ప్రాంతాలకు చెందిన దాదాపు 110 మంది కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గాత్రానికి సంధ్య రాణి, మృదంగానికి వీరాస్వామి, వయోలిన్‌కు ధనుంజయ్ సహకరించగా, నట్టువాంగం బాధ్యతలను గురువు శ్రీ సంతోష్ పెరుమాండ్ల నిర్వహించారు. అంతరించిపోతున్న పేరిణి నృత్యానికి పునర్ వైభవం తెస్తూ కళాకారులు చేసిన ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# నాగోల్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల జోరు

- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం
- టౌన్ ప్లానింగ్ అండదండలతో అక్రమ నిర్మాణాలు జోరు
- జీ+2 అనుమతులు... అంతకు మించి నిర్మాణాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- కొంతమంది స్థానిక ప్రజా ప్రతినిధుల అండదండలు ఉన్నయంటూ గుసగుసలు
- గతంలో ఉన్న కమిషనర్ పట్టించుకోలేదు
- నూతన డిప్యూటీ కమిషనర్ అయిన చొరవ తీసుకొని అడ్డుకట్ట వేస్తారా? లేదా?







**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :**

మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాగోల్ సర్కిల్-11లో అక్రమ నిర్మాణాలు విస్తృతంగా జరుగుతున్నాయని స్థానిక ప్రజలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బిల్డింగ్ నిర్మాణాలు చేపడుతున్న నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు మాత్రం జీ+2గా తీసుకుంటూ, వాస్తవంగా జీ+3, జీ+4, అంతస్తులు నిర్మిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ నిర్మాణాలు కూడా చేపడుతూ, టౌన్ ప్లానింగ్ నిబంధనలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్నారు. ఈ అక్రమాలకు టౌన్ ప్లానింగ్ అధికారులు, సెక్షన్ ఆఫీసర్లు సహకరిస్తున్నారని, కొంతమంది స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా వారికి వత్తాసుగా నిలుస్తున్నారని స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ చర్యల వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతుంది అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో డిప్యూటీ కమిషనర్, ఏసీపీ, టౌన్ ప్లానింగ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, సరైన స్పందన లేకపోవడం ప్రజల్లో అనుమానాలకు దారితీసింది . ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడం, అధికారులు అంటీముట్టనట్టుగా వ్యవహరించడం చూస్తుంటే, అక్రమాలకు వారు భాహిరంగగానే మద్దతు ఇస్తున్నట్టుగా స్థానికులు ఆరోపిస్తున్నారు. పెద్ద అంబర్పేట్ కుంట్లూర్ నాగోల్, మనసురాబాద్ డివిజన్ ప్రాంతాల్లో ఈ అక్రమ నిర్మాణాలు మరింత వేగంగా కొనసాగుతున్నాయని, అనుమతులు ఒకలా తీసుకుని నిర్మాణాలు మరొకలా కొనసాగించడం సాధారణంగా మారిపోయింది. రోడ్లుకు ఎటువంటి , సెట్ బ్యాక్స్ లేకుండ భద్రతా ప్రమాణాలను పట్టించుకోకుండా నిర్మాణాలు జరుగుతుండటంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురుకుంటున్నారు. ఇప్పటికైనా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ కమిషనర్ వెంటనే చొరవ చూపి, అక్రమ నిర్మాణాలను అరికట్టాలని, బాధ్యులైన అధికారులపై మరియు నిర్మాణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడడమే కాకుండా పట్టణాభివృద్ధిని క్రమబద్ధంగా కొనసాగించాలంటే కఠిన చర్యలు తప్పనిసరి.

## విజయవంతంగాఎన్సిఈటిఈటి 2026 జాతీయ సదస్సు




**విశాలభారతి:** లెర్న్ఎక్స్ థ్రైవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన "నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సులో వివిధ విద్యాసంస్థల అధ్యాపకులు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇంజినీరింగ్ మరియు సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందుతున్న సరికొత్త ధోరణులు, పరిశోధన ఫలితాలు మరియు ఆవిష్కరణలను పంచుకునేందుకు ఈ సదస్సు ఒక సమర్థవంతమైన వేదికగా నిలిచింది. సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ తదితర ఆధునిక సాంకేతిక అంశాలపై సాంకేతిక సెషన్లు, పరిశోధనా పత్రాల ప్రదర్శనలు మరియు చర్చలు నిర్వహించబడ్డాయి. వివిధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు, పరిశోధకులు మరియు అధ్యాపకులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మరియు తెలంగాణ రాష్ట్రాల నుండి పరిశోధనా పత్రాలు అందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇది సదస్సుకు విస్తృత స్థాయిలో అకాడమిక్ స్పందన లభించినట్లు సూచిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ సామ్సన్ అనోష్ బాబు పి, అసిస్టెంట్ ప్రొఫెసర్, మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్ విభాగం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ , జలంధర్, పంజాబ్ హాజరై పరిశోధన, ఆవిష్కరణలు మరియు ఇండస్ట్రీఅకాడమిక్ భాగస్వామ్యాల ప్రాముఖ్యతపై ప్రసంగించారు.

## బిజెపి జనాగ్రహ సభను విజయవంతం చేయండి

**కడారి కల్పన ఐలయ్య యాదవ్ బిజెపి పట్టణ అధ్యక్షులు**



**చౌటుప్పల్ విశాలభారతి:** సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నేడు మధ్యాహ్నం 3 గంటలకు జరుగే జనాగ్రహ సభను విజయవంతం చేయాలని చౌటుప్పల్ బిజెపి పట్టణ అధ్యక్షులు కడారి కల్పన ఐలయ్య యాదవ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేడు జరిగే జనాగ్రహ సభకు ముఖ్యఅతిథిగా భారత ప్రధాని నరేంద్ర మోడీ విచ్చేయుచున్నారు కావున చౌటుప్పల్ మున్సిపాలిటీ నుండి అధిక సంఖ్యలో బిజెపి శ్రేణులు కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.అదేవిధంగా మొన్న జరిగినటువంటి ఎలక్షన్లలో పశ్చిమబెంగాల్ అసోం పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయదుందుబి మోగించి అనంతరం తెలంగాణలో జరుగే అసెంబ్లీ ఎన్నికలలో భారీ స్థాయిలో విజయకేతనం ఎగురవేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెప్పాలని తెలంగాణలో బిజెపి ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించడం జరిగింది.

## బిజెపి బహిరంగ సభను విజయవంతం చేద్దాం!



**బోడుప్పల్, విశాలభారతి :** ఏప్రిల్ 10వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ లోని పెరేడ్ గ్రౌండ్లో భారతీయ జనతా పార్టీ భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ముఖ్యఅతిథిగా భారత ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొంటున్న ఈ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు బిజెపి శ్రేణులు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బోడుప్పల్ ఈస్ట్ బీజేపీ ప్రధాన కార్యదర్శి తుప్పత్ ఆనంద్ మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో అనేక ప్రజా సంక్షేమ పథకాలు చేపడుతూ, భారతదేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దుతున్నారని, భారతీయులందరూ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం దృఢంగా కోరుకుంటున్నారు అందుకు పశ్చిమబెంగాల్ ఫలితాలే నిదర్శనమని తెలంగాణ రాష్ట్రంలో కూడా భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం ప్రధాన ఎజెండాగా, నరేంద్ర మోడీ పథకాలను భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకుపోయింది బిజెపి బహిరంగ సభను నిర్వహిస్తుందని ఈ సభలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని తుప్పత్ ఆనంద్ పిలుపునిచ్చారు.

## కుమ్మరుల అభివృద్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**జిల్లా అధ్యక్షులు బాడిషా శంకర్రావు**



**పాల్వంచ విశాలభారతి:** రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల కోసం సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తూ అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మరుల అభివృద్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షులు బాడిష శంకర్రావు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు కుమ్మరి వృత్తితో విడదీయరాన్ని సంబంధం ఉందన్నారు. అలాంటి కుమ్మరి వృత్తిని కాపాడేందుకు మట్టి కోసం చెరువులను కేటాయించాలన్నారు. గతంలో మరల కోసం కేటాయించిన చెరువులు కబ్జాకు గురైన అట్టి వాటిపై తగు విచారణ జరిపించి స్వాధీనం చేసుకొని కుమ్మరులకు అప్పగించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంఘం కార్పొరేషన్ ఏర్పాటు చేసి లోన్ మంజూరు చేసి కులవృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న నిరుపేద కుమ్మరులను ఆదుకోవాలని కోరారు. కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నడికుడి జయంతి రావు ఆధ్వర్యంలో ఈనెల 17 ఆదివారం నాడు హైదరాబాద్ ఉస్మానియా క్యాంపస్ లో జరిగే కుమ్మరి సంఘం రాష్ట్ర సమావేశానికి సంఘం నాయకులతో పాటుగా, జిల్లా కార్యవర్గ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## ఆకలి తీర్చే 'హోప్'

- ప్రతి శనివారం 2 నుంచి 3 వేల మందికి అన్నదానం
- 183 వారాలుగా నిర్విరామ సేవ.. చైర్మన్ కొండ విజయ్ కుమార్ సేవలకు ప్రశంసలు

**చందానగర్,విశాలభారతి:** 'ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కన్నా మించిన సేవ లేదు' అనే మాటను నిజం చేస్తోంది హోప్ ఫౌండేషన్. చందానగర్ కేంద్రంగా ప్రతి శనివారం 2 వేల నుంచి 3 వేల మందికి రుచికరమైన భోజనం అందిస్తూ గత 183 వారాలుగా నిర్విరామంగా అన్నదానం నిర్వహిస్తోంది. ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ నేతృత్వంలో శనివారం జరిగిన 183వ వారపు అన్నప్రసాద వితరణ కార్యక్రమం మరోసారి ఆయన సేవా దృక్పథానికి అద్దం పట్టింది.శనివారం ఉదయం నుంచే హోప్ సభ్యులు వంటలు సిద్ధం చేసి, వచ్చిన ప్రతి ఒక్కరికీ అన్నం, కూర, పప్పు, పచ్చడి, స్వీట్ తో భోజనం ఏర్పాటు చేశారు. చైర్మన్ విజయ్ కుమార్ స్వయంగా వడ్డనలో పాల్గొని, వృద్ధులు, చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తూ భోజనం పెట్టారు. "ప్రతి వారం 2 నుంచి 3 వేల మంది ప్రజలు వచ్చి భోజనం చేయడం చూస్తే మా కష్టం మరచిపోతాం. ఇది చాలా అరుదైన సంతృప్తి"అని ఆయన అన్నారు.సమాజానికి తన వంతు సేవ చేయాలనే మానవతా దృక్పథంతో విజయ్ కుమార్ అన్నదానంతో పాటు వైద్య శిబిరాలు, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సాయం వంటి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని స్థానికులు కొనియాడారు. "ఆకలితో ఎవరూ నిద్రపోకూడదు అనే సంకల్పంతో ప్రతి శనివారం వేలాది మందికి కడుపు నింపుతున్నారు. ఇంత నిస్వార్థ సేవ చేయడం అందరికీ సాధ్యం కాదు" అని వృద్ధురాలు రాములమ్మ అభినందించారు.ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా హోప్ సభ్యులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారని, వడ్డన నుంచి పారిశుధ్యం వరకు ప్రతి విషయంలోనూ శ్రద్ధ చూపుతున్నారని విజయ్ కుమార్ తెలిపారు. ఎలాంటి డొనేషన్లు తీసుకోకుండా, దాతల సహకారం లేకుండా నా సొంత నిధులతోనే ఈ సేవా కార్యక్రమాన్ని 183 వారాలుగా నిరాటంకంగా కొనసాగిస్తున్నాను. ఇది నా బాధ్యతగా భావిస్తున్నా అని ఆయన వినమ్రంగా చెప్పారు.ఎలాంటి ఆర్భాటం లేకుండా, నిశ్శబ్దంగా సొంత ఖర్చులతో సేవ చేస్తున్న విజయ్ కుమార్ నిబద్ధత యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు అభిప్రాయపడ్డారు. అన్నదానంతో పాటు అనేక సేవా కార్యక్రమాలతో సమాజంలో 'హోప్' నింపుతున్న చైర్మన్ విజయ్ కుమార్‌కు, ఫౌండేషన్ సభ్యులకు స్థానికులు,అభిమానులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## మోదీ సభకు భారీ సన్నాహాలు

**రాజేంద్రనగర్లో బీజేపీ సమావేశం**




**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి కాటేదన్‌లో ఉన్న బీజేపీ పార్టీ కార్యాలయంలో శనివారం కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. డివిజన్‌కు చెందిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా తెలంగాణకు రానున్న నేపథ్యంలో, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలర్ దేవ్ పల్లి డివిజన్ నుంచి భారీగా జనసమీకరణ జరపాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సుమారు 30 బస్సులు, 150 కార్లు మరియు 3000 మందికి పైగా కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి కార్యకర్త సమయానికి వాహనాల వద్దకు చేరుకుని సభకు హాజరై ప్రధానమంత్రికి ఘన స్వాగతం పలకాలని కోరారు. ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బుచ్చిరెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షుడు అడికే జనార్ధన్, బబ్లూ, ఎల్‌వీ రెడ్డి, పృధ్వీరాజ్, బొల్ల రామకృష్ణ, కృష్ణ జయంతి, అంజమ్మ, ఎండి షకీల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకర డ్రైవింగ్‌కు పాల్పడుతున్న ఆరుగురు అరెస్ట్





**రాజేంద్రనగర్, విశాలభారతి :** హైదరాబాద్ నగరంలో బహిరంగ రహదారులపై ప్రమాదకర బైక్ స్టంట్లు చేస్తూ ప్రజల ప్రాణాలను సవాల్ చేసిన ఆరుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ చర్యను హైదరాబాద్ పోలీస్ పరిధిలోని రాజేంద్రనగర్ టాస్క్ ఫోర్స్ మరియు అత్తాపూర్ పోలీసులు సంయుక్తంగా చేపట్టారు. అత్తాపూర్ నుండి ఆరాంఘర్ వరకు ఉన్న ప్రధాన రహదారులపై గత కొంతకాలంగా కొందరు యువకులు ద్విచక్ర వాహనాలతో వేగంగా ప్రయాణిస్తూ వీలీలు, జిగ్‌జాగ్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర విన్యాసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ చర్యల వల్ల పాదచారులు మరియు ఇతర వాహనదారుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. విశ్వసనీయ సమాచారం ఆధారంగా దాడులు నిర్వహించిన పోలీసులు ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుండి నేరాలకు ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలు మరియు ఆరు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ. 1.5 లక్షలు అని అధికారులు తెలిపారు. అరెస్టు చేసిన వారిలో కొందరిపై గతంలో కూడా ఇలాంటి కేసులు నమోదై ఉండగా, ఒక నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన పోలీసు బృందాలను నగర పోలీస్ కమిషనర్ అభినందించారు. ఇదిలా ఉండగా, తల్లిదండ్రులు తమ పిల్లల కార్యకలాపాలను నిశితంగా గమనించాలని, ప్రమాదకర డ్రైవింగ్ వంటి చట్టవిరుద్ధ చర్యలకు దూరంగా ఉండేలా వారికి అవగాహన కల్పించాలని పోలీసులు సూచించారు. రహదారులపై ఎక్కడైనా ఇలాంటి స్టంట్లు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## మయూరి నగర్‌లో సీసీ రోడ్ల పనుల పరిశీలన

**నాణ్యతలో రాజీ పడొద్దు.. మాజీ కార్పొరేటర్ శ్రీకాంత్**




**మియాపూర్,విశాలభారతి:** మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీలో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ శనివారం కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ మయూరి నగర్ అభివృద్ధికి కృషి చేస్తామని, కాలనీలో మౌలిక వసతులు కల్పించడమే ప్రధాన ధ్యేయమని అన్నారు. సీసీ రోడ్ల నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించినట్లు తెలిపారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు.కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సహకారంతో డివిజన్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులను పూర్తి చేసి విడతల వారీగా ప్రజలకు అందుబాటులోకి తెస్తామని శ్రీకాంత్ పేర్కొన్నారు.కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఖలిదిండి రామరాజు, కార్యవర్గ సభ్యులు కిషోర్, హరికృష్ణ, రమణ రెడ్డి, వెంకట్ , భాష, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు కీలక అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్




- సీఎస్ రామకృష్ణారావుతో వీసీ -
- జిల్లా పురోగతి వివరించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి,విశాలభారతి:**

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ రామకృష్ణారావు శుక్రవారం జిల్లా కలెక్టర్లతో దృశ్య శ్రవణ సమావేశం నిర్వహించారు. అగ్రి స్టాక్‌లో రైతుల రిజిస్ట్రేషన్, జనాభా గణన, ధాన్యం కొనుగోలు, విద్యా వారోత్సవాల నిర్వహణపై సీఎస్ పలు ఆదేశాలు జారీ చేశారు. వీసీ అనంతరం కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జిల్లాలో ఈ నాలుగు అంశాల పురోగతిని వివరించారు. సెన్సస్ 2027లో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 9,631 మంది స్వీయ గణన పూర్తి చేశారని తెలిపారు. మే 11 నుంచి జూన్ 9 వరకు 30 రోజుల పాటు గృహ గణన జరుగుతుందని, 1,954 మంది ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో పని చేస్తారని చెప్పారు. మే 11 నుంచి ప్రారంభమయ్యే విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. సోమవారం ఎల్.బీ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి సమావేశానికి జిల్లా నుంచి 400 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఏఎంసీ సభ్యులను బస్సుల్లో హైదరాబాద్‌కు పంపేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అగ్రి స్టాక్‌లో ప్రతి రైతు తప్పనిసరిగా పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. నమోదైన రైతులకు 11 అంకెల ప్రత్యేక గుర్తింపు కార్డు ఇస్తామని, దీనివల్ల ప్రభుత్వ పథకాలు నేరుగా అందుతాయని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 2,11,434 మంది రైతులు నమోదు చేసుకోగా, ఇంకా 1,01,505 మంది నమోదు కావాల్సి ఉందన్నారు. రబీ 202526 వరి కొనుగోళ్లపై మాట్లాడుతూ, ఇప్పటివరకు 2,06,977 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. అందులో 1,64,747 మె.ట.లకు TAB ఎంట్రీలు 80%, 1,51,330 మె.ట.లకు ట్రక్ చిట్లు 92%, 1,44,893 మె.ట.లకు మిల్లర్ అంగీకారాలు 96% పూర్తయ్యాయని తెలిపారు. రైతులకు MSP కింద 1,44,039 మె.ట.లకు రూ.344.11 కోట్లు చెల్లించామన్నారు. పెండింగ్‌లో ఉన్న TAB ఎంట్రీలు, ట్రక్ చిట్లు, మిల్లర్ అంగీకారాలను ప్రాధాన్యతగా పూర్తి చేసి రైతులకు త్వరితగతిన చెల్లింపులు జరపాలని అన్ని విభాగాల అధికారులను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో అన్ని PPC కేంద్రాల్లో తార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, తూకం వేసిన సంచులు, ధాన్య నిల్వలను వర్షం నుంచి రక్షించాలని సూచించారు. రైతులు కూడా ధాన్యం కుప్పలను తార్పాలిన్లతో కప్పుకోవాలని, ఉరుములుమెరుపుల సమయంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి. విక్టర్, డీఆర్డీఓ, డీసీఓ, వ్యవసాయ, విద్యా, సివిల్ సప్లైస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హన్మకొండ జిల్లా ఒక్కరోజే గడువు స్వీయ
# జనగణన తప్పనిసరి

**హనుమకొండ ,విశాలభారతి:**



2027 జనగణనలో భాగంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ స్వీయ జనగణనకు ఈ నెల 10వ తేదీ రాత్రి 12 గంటల వరకు మాత్రమే అవకాశం ఉన్నందున, హన్మకొండ జిల్లా ప్రజలందరూ తప్పనిసరిగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. ప్రజలు ఇంటి వద్ద నుంచే సులభంగా https://se.census.gov.in□ వెబ్‌సైట్ ద్వారా స్వీయ గణన పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. మొబైల్ ఫోన్ ద్వారానే ఈ ప్రక్రియను సులభంగా పూర్తి చేయవచ్చని, తమకు నచ్చిన భాషను ఎంపిక చేసుకుని కుటుంబ వివరాలను నమోదు చేయవచ్చని పేర్కొన్నారు. గత నెల 26వ తేదీ నుండి ప్రారంభమైన ఈ స్వీయ జనగణన కార్యక్రమం ఈ నెల 10వ తేదీతో ముగియనున్నందున, ఇంకా నమోదు చేయని వారు వెంటనే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. జనగణన ప్రక్రియలో భాగంగా ముందుగా స్వీయ గణన, అనంతరం గృహాల లెక్కింపు, తదుపరి పూర్తి స్థాయి జనగణన చేపడతారని వివరించారు. ;ఈ నెల 11వ తేదీ నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి హౌస్ లిస్టింగ్ ప్రక్రియను ప్రారంభిస్తారని తెలిపారు. దేశ ప్రణాళికలు, సంక్షేమ పథకాల రూపకల్పన, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలు, వనరుల సమర్థవంతమైన పంపిణీకి జనగణన అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారు కూడా తమ ప్రస్తుత నివాసం నుంచే వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జనగణన సందర్భంగా కుటుంబానికి సంబంధించిన పూర్తి మరియు సరైన వివరాలను అందించాలని ప్రజలను కోరారు. ప్రజలు అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, అది కేవలం జనాభా లెక్కల కోసం మాత్రమే వినియోగించబడుతుందని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ నమోదు పూర్తయ్యాక ఎన్యుమరేషన్ ఐడి లభిస్తుందని, ఆ ఐడీ ఆధారంగా ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని తెలిపారు. స్వీయ జనగణనకు ఒక్కరోజే గడువు మిగిలి ఉన్నందున, హన్మకొండ జిల్లా ప్రజలందరూ బాధ్యతగా పాల్గొని ఈ జాతీయ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు.

## అండగా ఉంటా.. ఆదుకుంటా

**అర్సపల్లి షార్ట్ సర్క్యూట్ బాధితులకు అర్బన్ ఎమ్మెల్యే పరామర్శ**

**ఇందూరు ,విశాలభారతి:** షార్ట్ సర్క్యూట్ కారణంగా సర్వం కోల్పోయిన బీజేపీ నాయకురాలు మీరా వైచల్ కుటుంబానికి అండగా ఉంటానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని అర్సపల్లి లో గల జరిగిన సంఘటన స్థలాన్ని పరిశీలించి, కుటుంబానికి ధైర్యాన్ని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మీరా వైచల్ పిల్లల విద్యాభ్యాసానికి తన వంతు సహాయం ఉంటుందన్నారు. షార్ట్ సర్క్యూట్ తో సర్వం కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా అందాల్సిన సహాయం కూడా వీలైనంత తొందరగా అందేలా చూడాలని ఆర్డిఓ రాజేంద్రప్రసాద్ను ఆదేశించారు.

విశాల భారతి

CINEMA



## సమ గౌరవాన్ని కాంక్షించడం తప్పా?

బాలీవుడ్ సినీ పరిశ్రమలో అసమానతల గురించి ఇటీవల కథానాయిక కృతి సనన్ మాట్లాడారు. ఈ క్రమంలో హీరోయిన్లు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ఆమె చెబుతూ.. 'సినిమా బడ్జెట్ పెరుగుదల విషయంలో నిర్మాతలు బాధపడటంలో అర్థం వుంది. కానీ దాన్ని నియంత్రించే క్రమంలో హీరోయిన్ల పారితోషికాలు తగ్గిస్తారు తప్ప, హీరోల పారితోషికాల జోలికి వెళ్లరు. నిజానికి బడ్జెట్‌లో ఎక్కువ భాగం హీరో పారితోషికమే ఉంటుంది. కానీ బడ్జెట్ కంట్రోల్‌ని మా దగ్గర్నుంచే ప్రారంభిస్తారు. అంతేకాదు.. సెట్‌లోకి హీరో రాకముందే హీరోయిన్ రెడీగా ఉందా? లేదా? అని చూస్తారు. హీరోలను మాత్రం వెయిట్ చేయించరు. ఈ ధోరణిలో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నా కెరీర్ తొలినాళ్లలో నాతో నటించిన హీరోకు నా కంటే మంచి కారు ఇచ్చారు. నిజానికి అతను అప్పటికే నాకంటే జూనియర్. నేను కారు గురించి మాట్లాడటంలేదు. గౌరవం గురించి ప్రశ్నిస్తున్నా. హీరోలతో సమానమైన గౌరవాన్ని హీరోయిన్లు కాంక్షించడంలో తప్పులేదని నా ఉద్దేశ్యం' అన్నారు కృతి సనన్.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.